



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 9 సంచిక : 162 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : కాకినాడ | సోమవారం 16 ఫిబ్రవరి 2026 | వెల : 1/-రూ ॥

VOLUME :9 ISSUE : 162 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : KAKINADA | MON 16 FEBRUARY 2026 | PRICE : 1/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## ఏఐ నాయకత్వానికి అవసరమైన వనరులన్నీ భారత్ వద్ద ఉన్నాయి

- ఏఐలో భారత్ పూర్తిస్థాయి లీడర్‌గా ఎదుగుతుందన్న శామ్ ఆల్ట్‌మన్
- చాట్‌జీపీటీకి ప్రపంచంలోనే రెండో అతిపెద్ద మార్కెట్ భారత్
- భారత్‌లో వారానికి 10 కోట్ల యాక్టివ్ యూజర్లు ఉంటున్నారని వెల్లడి
- భారత్‌లో కార్యకలాపాలను మరింత విస్తరిస్తామని ప్రకటన
- ప్రభుత్వంతో కొత్త భాగస్వామ్యాలు కుదుర్చుకునే సూచనలు



మిగతా 2లో

## బంగ్లాదేశ్‌లో ఎన్నికలు పూర్తి... మహ్మద్ యూనస్ పరిస్థితేంటి?

- 2024లో కూలిపోయిన 2024లో షేక్ హసీనా ప్రభుత్వం
- తాత్కాలిక పాలకుడిగా కొనసాగిన మహ్మద్ యూనస్
- బంగ్లాదేశ్‌లో ప్రస్తుతం కొత్త ప్రభుత్వ ఏర్పాటు.. ప్రధానిగా తారిక్ రహ్మన్
- ముహమ్మద్ యూనస్‌కు రాష్ట్రపతి పదవి దక్కవచ్చంటూ ఊహాగానాలు
- రాజకీయ పదవులపై తనకు ఆసక్తి లేదని స్పష్టం చేసిన యూనస్



మిగతా 2లో

## మా డబ్బు, గిఫ్ట్‌లు మాకివ్వండి:

### ఇంటింటికి వెళ్లి అడుగుతున్న ఓడిపోయిన అభ్యర్థులు

- ఎన్నికల నేపథ్యంలో ఓటర్లకు బహుమతులు ఇచ్చిన అభ్యర్థులు
- మూడుచింతలపల్లి, మంచిర్యాల, భువనగిరిలో బహుమతులు వెనక్కి అడుగుతున్న అభ్యర్థులు
- ఇంటింటికి తిరిగి వసూలు చేసే ప్రయత్నం



మిగతా 2లో

## కోవా బన్ వ్యాపారి వలీకి అండగా ఉంటాం

### మంత్రి నారా లోకేశ్ భరోసా

- మేడారం జాతరలో కర్నూలు చిరు వ్యాపారికి వేధింపులు
- 'ఫుడ్ జిహాద్' ఆరోపణలతో వేధింపులకు పాల్పడిన యూట్యూబర్లు
- ఘటనపై తీవ్రంగా స్పందించిన మంత్రి నారా లోకేశ్
- బాధితుడు వలీకి క్షమాపణ చెబుతూ ట్వీట్
- త్వరలోనే వలీని కలుస్తానని, కోవా బన్ తింటానని హామీ



పెన్ పవర్ డెస్క్:తెలంగాణలోని మేడారం జాతరలో కర్నూలుకు చెందిన ఓ చిరు వ్యాపారి వేధింపులకు గురికావడం పట్ల ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ తీవ్రంగా స్పందించారు. ఈ ఘటన పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, బాధితుడైన వలికి బహిరంగంగా క్షమాపణ చెప్పారు. వివరాల్లోకి వెళితే, కర్నూలు జిల్లాకు చెందిన వలీ అనే చిరు వ్యాపారి మేడారం జాతరలో కోవా బన్ అమ్ముకుంటున్నాడు. ఈ క్రమంలో కొందరు యూట్యూబర్లు అతడిని అడ్డుకుని,

- మిగతా 2లో...

# నేడు ఏపీలో బిల్ గేట్స్ పర్యటన

- సీఎం చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్‌తో కీలక అంశాలపై గేట్స్ చర్చలు
- విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో సహకారంపై ప్రధానంగా దృష్టి
- ఆర్‌టీజీఎస్ కేంద్రం, ఉండవల్లి పొలాలను సందర్శించనున్న బిల్ గేట్స్
- గేట్స్ ఫౌండేషన్ సహకారంతో సంజీవని ప్రాజెక్టును విస్తరించనున్న ప్రభుత్వం



పెన్ పవర్ డెస్క్:మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపక అధినేత బిల్ గేట్స్ సోమవారం ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో కీలక రంగాల్లో భాగస్వామ్యంపై చర్చించేందుకు ఆయన తన బృందంతో కలిసి ఏపీకి వస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌లతో సమావేశమవుతారు. ఆదివారం అందిన సమాచారం ప్రకారం, సోమవారం ఉదయం 10 గంటలకు బిల్ గేట్స్ సచివాలయానికి చేరుకుంటారు. ముందుగా రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్‌టీజీఎస్) కేంద్రాన్ని సందర్శించి, పాలనలో సాంకేతికత వినియోగాన్ని పరిశీలిస్తారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు, ఇతర మంత్రులు, అధికారులతో బిల్ గేట్స్ బృందం సమావేశమవుతుంది. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో గేట్స్ ఫౌండేషన్ సహకారంతో ఇప్పటికే అమలవుతున్న ప్రాజెక్టులను మరింతగా విస్తరించడంపై ఈ భేటీలో ప్రధానంగా చర్చిస్తారు.'స్వర్ణాంధ్ర విజన్-2047' లక్ష్యాల సాధనకు చేపట్టిన సంస్కరణలు, ప్రజారోగ్యం, వ్యవసాయం, విద్య, మెడ్‌టెక్, సంజీవని వంటి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి చంద్రబాబు బిల్ గేట్స్‌కు ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. ముఖ్యంగా, గేట్స్ ఫౌండేషన్ సహకారంతో నడుస్తున్న 'సంజీవని' ప్రాజెక్టు పనితీరును ప్రభుత్వం ఆయనకు ప్రత్యేకంగా వివరించనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా డిజిటల్ హెల్త్ రికార్డులు రూపొందించి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.సమావేశాల అనంతరం, బిల్ గేట్స్ బృందం అమరావతిలోని ఉండవల్లి సమీపంలో ఉన్న ఓ వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శిస్తుంది. అక్కడ డ్రోన్లు, ఏఐ టెక్నాలజీ సహాయంతో చేపడుతున్న ఆధునిక వ్యవసాయ పద్ధతులను పరిశీలించనుంది.



## జనసేనకు భారీ విరాళం ప్రకటించిన పవన్ కల్యాణ్

- శివరాత్రి పర్వదినాన జనసేనకు శుభారంభం
- పార్టీకి రూ.2 కోట్ల విరాళం ప్రకటించిన పవన్ కల్యాణ్
- పార్టీ కోసం శ్రమించే వారే తమకు ముఖ్యమని ప్రకటన

పెన్ పవర్ డెస్క్:శివరాత్రి పండుగ రోజు జనసేన పార్టీకి మరో శుభారంభం అయింది. పార్టీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ స్వయంగా తొలి సభ్యత్వం తీసుకుని పార్టీకి రూ.2 కోట్ల విరాళం ప్రకటించారు. అనంతరం మాట్లాడుతూ పార్టీ భావజాలాన్ని లోతుగా అర్థం

- మిగతా 2లో...



## బంగ్లా నూతన ప్రధాని ప్రమాణ స్వీకారానికి భారత్ ప్రతినిధిగా స్పీకర్ ఓం బిర్లా

- ఎన్నికల్లో ఘన విజయం సాధించిన తారిఖ్ రెహమాన్ నేతృత్వంలోని బీఎన్‌పీ
- నూతన ప్రభుత్వాన్ని స్వాగతిస్తూ భారత విదేశాంగ శాఖ ప్రకటన
- ఫిబ్రవరి 17న ధాకాలో జరగనున్న ప్రమాణ స్వీకార కార్యక్రమం
- దాదాపు 35 ఏళ్ల తర్వాత బంగ్లాదేశ్‌కు పురుష ప్రధాని రాక

పెన్ పవర్ డెస్క్:బంగ్లాదేశ్‌లో కొత్తగా ఎన్నికైన ప్రభుత్వ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి భారత ప్రభుత్వం తరఫున లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా హాజరుకానున్నారు. ఈ కార్యక్రమం ఫిబ్రవరి 17న రాజధాని ధాకాలో జరగనున్నట్లు భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఇటీవల జరిగిన బంగ్లాదేశ్ పార్లమెంటరీ ఎన్నికల్లో తారిఖ్ రెహమాన్ నేతృత్వంలోని

మిగతా 2లో

### తెలుగు రాష్ట్రాల్లో శివ నామస్మరణతో

## హోరెత్తుతున్న శైవ క్షేత్రాలు

### మహాశివరాత్రి

### భక్తులతో కిటకిటలాడుతున్న శివాలయాలు

### తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లోని శైవక్షేత్రాలు 'ఓం నమః శివాయ' నామస్మరణతో మార్మోగుతున్నాయి. ఆదివారం (ఫిబ్రవరి 15) తెల్లవారుజాము నుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తడంతో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరుస్తోంది. ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలైన శ్రీశైలం, వేములవాడ, కాళేశ్వరం, కోటిపల్లి సహా అన్ని శివాలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. పవిత్ర నదుల్లో స్నానాలు ఆచరించిన భక్తులు,

- మిగతా 2లో...




## రైతులకు పూర్తి రక్షణ... రాహుల్ గాంధీ తప్పుదోవపట్టిస్తున్నాడు



- యూఎస్, ఈయూ వాణిజ్య ఒప్పందాలపై కాంగ్రెస్ ఆరోపణలు
- ఖండించిన అమిత్ షా
- రైతు, పాడి, మత్స్య రంగాలకు పూర్తి రక్షణ కల్పించామని వెల్లడి
- యూపీఏ, ఎన్డీయే వ్యవసాయ బడ్జెట్లను పోల్చిన హోంమంత్రి
- విషయంపై చర్చకు రావాలంటూ రాహుల్ గాంధీకి బహిరంగ సవాల్

పెన్ పవర్ డెస్క్:అమెరికా, యూరోపియన్ యూనియన్‌లతో భారత్ ఇటీవల కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాల వల్ల దేశంలోని రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందంటూ కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలను కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్రంగా ఖండించారు. రైతుల విషయంలో కాంగ్రెస్, ఆ పార్టీ నేత రాహుల్ గాంధీ అబద్ధాలు ప్రచారం చేస్తూ దేశాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. ప్రతి ఒప్పందంలోనూ వ్యవసాయం, పాడి, మత్స్య రంగాల ప్రయోజనాలకు ప్రభుత్వం పూర్తి రక్షణ కల్పించిందని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం గాంధీనగర్‌లో దేశంలోనే తొలి సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ ఆధారిత ప్రజా పంపిణీ వ్యవస్థను

- మిగతా 2లో...



## అమెరికాతో ట్రేడ్ డీల్:

### ప్రధాని మోదీకి రాహుల్ గాంధీ 5 ప్రశ్నలు

- అమెరికా వాణిజ్య ఒప్పందంపై మోదీ సర్కార్‌పై రాహుల్ దాడి
- ప్రధాని మోదీకి 5 సూటి ప్రశ్నలు సంధించిన రాహుల్
- ఈ ఒప్పందం రైతులకు ద్రోహం చేయడమేనని ఆరోపణ
- జీఎం పంటలు, సోయా, పాల రంగాలపై ప్రభావంపై ఆందోళన
- భారత వ్యవసాయంపై అమెరికా పట్టు సాధిస్తుందని హెచ్చరిక

పెన్ పవర్ డెస్క్:భారత్-అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందంపై కాంగ్రెస్ అగ్రనేత, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, మోదీ ప్రభుత్వంపై తన దాడిని మరింత తీవ్రతరం చేశారు. ఈ ఒప్పందం భారత రైతులకు చేసిన ద్రోహమని ఆరోపిస్తూ,

- మిగతా 2లో...



### 'వికసిత్ భారత్' నిర్మాణానికి

## ఏపీ బడ్జెట్ పునాది

పెన్ పవర్ డెస్క్: ఏపీ బడ్జెట్ ప్రగతిశీల బడ్జెట్ అని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధులు, మీడియా ప్యానలిస్టులతో ఆయన ఆడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. భవిష్యత్ కార్యాచరణపై అధికార ప్రతినిధులకు దిశానిర్దేశం చేశారు. కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లను సమ్మిళితం చేస్తూ ప్రజలకు వివరించాలని సూచించారు."శనివారం ప్రవేశపెట్టిన బడ్జెట్.. రాష్ట్రాభివృద్ధికి ఒక స్పష్టమైన రోడ్‌మ్యాప్.

- మిగతా 2లో...

## ఎడిటర్ వ్యూ

# జగన్ డెసిషన్ బూమరాంగ్ అవుతోందా ?

ఏపీ మాజీ సీఎం వైసీపీ అధినేత జగన్ ఒక నిర్ణయం తీసుకున్నారు అంటే వెనక్కి వెళ్ళారు అని అంటారు. మరి ఆ సంగతి పక్కన పెడితే అసెంబ్లీకి జగన్ ఆయన ఎమ్మెల్యేలు హాజరయ్యే విషయంలో మాత్రం పట్టుదలగానే ఉన్నారని అంటున్నారు. తమకు ప్రతిపక్ష హోదా ఇస్తేనే సభకు వెళ్తామని వైసీపీ అధినేత అంటున్నారు. రూల్స్ అండ్ రెగ్యులేషన్స్ అలా లేవని అధికార పక్షం చెబుతోంది. దానికి ఎన్నో ఉదాహరణలు కూడా చూపిస్తోంది. అయితే దీని మీద న్యాయ పోరాటం చేస్తున్నామని వైసీపీ అంటోంది. ఈలోగా ఇరవై నెలలు గడచిపోయాయి. అంటే మూడవ వంతు అన్న మాట.

**ప్రజలు కోరుకునేది అదే :**

నిజానికి ఎమ్మెల్యేగా గెలిచిన వారు అసెంబ్లీకి తప్పనిసరిగా వెళ్లాల్సి ఉంటుంది. వారిని గెలిపించేది ప్రజలు ఎమ్మెల్యేగానే. వారు మంత్రి అవుతారా లేక ముఖ్యమంత్రి అవుతారా లేదా ప్రతిపక్ష నేత అవుతారా అన్నది ప్రజలు ఎవరూ ఆలోచించి ఓటేయరు. ఒక వేళ వారు కీలక స్థానాలలోకి వెళ్ళినా వారు ఆ ప్రాంతానికి ఎమ్మెల్యేగానే ఉంటారు. హోదా వల్ల వారికి అదనంగా ప్రయోజనం చేకూరే అవకాశం ఉండొచ్చు కానీ బేసికల్ గా అయితే తమ ఎమ్మెల్యే నియోజకవర్గం సమస్యల గురించి అసెంబ్లీలో ప్రస్తావిస్తారని ఓటేస్తారని వారు ఆశిస్తారు. మరి ఎమ్మెల్యేగా గెలిచిన వారు సభకు వెళ్లకపోతే ప్రజా తీర్పునకు మూల నిర్వచనానికీ కూడా విఘాతం కలుగుతుందని మేధావులు అంటున్నారు.

**అసెంబ్లీకి దూరం ఎందుకు :**

వైసీపీ విషయానికి వస్తే తమకు అసెంబ్లీలో మాట్లాడటానికి మైక్ ఇవ్వరని అంటోంది. సభకు వస్తే తాము తప్పకుండా అవకాశం ఇస్తామని స్పీకర్ చెబుతూ వస్తున్నారు. మరి అది ఏమిటో తెలియాలీ అంటే తప్పకుండా వైసీపీ ఎమ్మెల్యేలు సభకు వెళ్లాల్సి ఉంటుంది. కానీ వైసీపీ మాత్రం హాజరు కావడం లేదు. జగన్ వరకూ చూసుకుంటే ఆయన వెళ్లకపోయినా తన ఎమ్మెల్యేలను అయినా సభకు పంపించాల్సి ఉంది అని అంటున్నారు. ఇరవై నెలల కూటమి పాలనలో ఎన్నో ప్రజా సమస్యల మీద విపక్షంగా వైసీపీ ప్రశ్నించాల్సి ఉంది. అలా అసెంబ్లీ నుంచి ప్రశ్నిస్తే దానికి వచ్చే మైలేజ్ కానీ జనాల నుంచి వచ్చే స్పందన కానీ వేరు అని అంటున్నారు.

**అవమానాలు తప్పవా :**

ఇక వైసీపీ ఎమ్మెల్యేలు సభకు వస్తే అవమానిస్తారు అన్నది కూడా ఉంది. అలా అవమానిస్తే వాటిని ఫేస్ చేసేందుకు కూడా సిద్ధంగా ఉండాలని అంటున్నారు అపుడే జనంలో సానుభూతి అయినా పెరుగుతుంది అని అంటున్నారు. గతంలో చంద్రబాబుని వైసీపీ వారు నిండు అసెంబ్లీలో చేసిన కామెంట్స్ వల్లనే ఆయన సభకు ఇంకా రెండేళ్ళు సమయం ఉండగా నమస్కారం పెట్టి బయటకు వెళ్ళారు తిరిగి సీఎం అయ్యారు. అందువల్ల ఈ రోజు అవమానం రేపటి రోజున అధికారం అన్నది ఎన్నో సార్లు రుజువు అయింది. అయినా ప్రజల కోసం అవమానం పడతామని వైసీపీ నిర్ణయించుకుంటే ఆ లెక్కే వేరు అని అంటున్నారు.

**రాంగ్ అవుతోందిగా :**

వైసీపీ సభకు దూరంగా ఉండడం రాంగ్ డెసిషన్ గానే అంటున్నారు. వైసీపీలోనూ దీని మీద అంతర్గతంగా మథనం జరుగుతోంది కానీ ఎవరూ బయటకు ఏమీ అనలేని పరిస్థితి ఉంది అని అంటున్నారు. రాజకీయాలు అన్నవి ప్రజలకు సంబంధించినవి. వాటిని ప్రజా కోణంలో నుంచే చూడాలి. వారి ఆలోచనలనే నాయకులు పరిగణనలోకి తీసుకోవాలి. ఆ విధంగా ఆలోచిస్తే వైసీపీ బంగారం లాంటి బడ్జెట్ సెషన్ అవకాశాలని వదులుకుంటోంది అని అంటున్నారు. ఈ విషయంలో వైసీపీ పునరాలోచన చేస్తే బాగుంటుంది అన్న సూచనలు వెలువడుతున్నాయి. కానీ అలా జరుగుతుందా అంటే ఏమో వేచి చూడాల్సిందే.

# ఏఐ నాయకత్వానికి అవసరమైన వనరులన్నీ భారత్ వద్ద ఉన్నాయి

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో భారత్ ఒక పూర్తిస్థాయి లీడర్‌గా ఎదిగే సత్తా ఉందని చాట్‌జీపీటీ సృష్టికర్త 'ఓపెన్‌ఏఐ' సీఈవో శామ్ ఆల్ట్‌మన్ ప్రశంసించారు. అందుకు అవసరమైన వనరులన్నీ భారత్ వద్ద ఉన్నాయని అన్నారు. భారత్‌లో చాట్‌జీపీటీని వారానికి 10 కోట్ల మంది యాక్టివ్ యూజర్లు ఉపయోగిస్తున్నారని, ఇది తమకు ప్రపంచంలోనే రెండో అతిపెద్ద మార్కెట్ అని ఆయన వెల్లడించారు. ఫిబ్రవరి 16 నుంచి న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ప్రారంభం కానున్న 'గ్లోబల్ ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026' నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఒక మీడియా కథనంలో ఆయన మాట్లాడుతూ, అమెరికా తర్వాత భారత్‌లోనే తమకు అత్యధిక యూజర్లు ఉన్నారని తెలిపారు. ప్రపంచంలోనే అత్యధిక విద్యార్థి యూజర్లు కూడా భారత్ నుంచే ఉన్నారని, శాస్త్రీయ పరిశోధనల కోసం ఉద్దేశించిన 'ప్రిజమ్' అనే ఉచిత టూల్ వినియోగంలో భారత్ ప్రపంచంలో నాలుగో స్థానంలో ఉందని వివరించారు. వచ్చే వారం తాను భారత్‌లో పర్యటించనున్నట్లు ఆల్ట్‌మన్ తెలిపారు. ఏఐని "భారత్‌లోనే, భారత్‌తోనే, భారత్ కోసమే" అభివృద్ధి చేసేందుకు తాము కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. గతేడాది ఢిల్లీలో తొలి కార్యాలయాన్ని ప్రారంభించామని, ఈ ఏడాది కార్యకలాపాలను మరింత విస్తరించాలని యోచిస్తున్నట్లు చెప్పారు. ఏఐ ప్రయోజనాలను అందరికీ అందించేందుకు ప్రభుత్వంతో కొత్త భాగస్వామ్యాలు కుదుర్చుకునే అవకాశాలు ఉన్నాయని ఆయన సూచనప్రాయంగా వెల్లడించారు. అన్ని వర్గాలకు అందుబాటులో ఉండేలా ఏఐని క్షేత్రస్థాయికి చేర్చడానికి 'యాక్సెస్, అడాప్షన్, ఏజెన్సీ' అనే త్రిముఖ వ్యూహాన్ని అనుసరిస్తున్నామని తెలిపారు. ఇటీవలే నాలుగు భారతీయ నగరాల్లో 200 మందికి పైగా ఎన్జీవో ప్రతినిధులకు చాట్‌జీపీటీ వినియోగంపై శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

# బంగ్లాదేశ్‌లో ఎన్నికలు పూర్తి... మహ్మద్ యూనస్ పరిస్థితేంటి?

బంగ్లాదేశ్ రాజకీయాల్లో ఒక కీలక అధ్యాయం ముగిసి, కొత్త శకం ప్రారంభమవుతోంది. 2024లో షేక్ హసీనా ప్రభుత్వం కూలిపోయిన తర్వాత తాత్కాలిక ప్రభుత్వ అధినేతగా దేశాన్ని నడిపించిన నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మహ్మద్ యూనస్, ఎన్నికైన ప్రభుత్వానికి అధికారాన్ని బదిలీ చేసేందుకు సిద్ధమయ్యారు. ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) ఘన విజయం సాధించడంతో, ఆ పార్టీ చైర్మన్ తారిక్ రహ్మాన్ దేశ నూతన ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్నారు. సుమారు 17 ఏళ్ల పాటు విదేశాల్లో ప్రవాస జీవితం గడిపిన ఆయన, ఇప్పుడు దేశ రాజకీయాల్లోకి పునరాగమనం చేస్తున్నారు.

ఫిబ్రవరి 17న జరగనున్న తారిక్ రహ్మాన్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి భారత ప్రధాని నరేంద్ర మోదీ సహా 13 దేశాల అధినేతలకు ఆహ్వానాలు పంపారు. దేశంలో స్థిరత్వం, సమగ్ర పాలన అందించి అభివృద్ధి పథంలో నడిపిస్తామని తారిక్ రహ్మాన్ ఇప్పటికే ప్రకటించారు. ఈ అధికార మార్పిడి నేపథ్యంలో, మహ్మద్ యూనస్ భవిష్యత్తుపై తీవ్రమైన చర్చ జరుగుతోంది. ఆయనకు రాజ్యాంగబద్ధమైన పదవి, ముఖ్యంగా రాష్ట్రపతి పదవి ఇవ్వాలనే డిమాండ్ సోషల్ మీడియాలో బలంగా వినిపిస్తోంది. యూనస్‌కు ఉన్న అంతర్జాతీయ ఖ్యాతిని ఉపయోగించుకుని, కొత్త ప్రభుత్వం దేశ దౌత్య సంబంధాలను బలోపేతం చేసుకోవచ్చని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. "దేశీయ వ్యవహారాలపై దృష్టి సారించే ప్రధాని, అంతర్జాతీయంగా పలుకుబడి ఉన్న రాష్ట్రపతి ఉంటే బంగ్లాదేశ్‌కు ఎంతో మేలు జరుగుతుంది" అని ప్రముఖ కాలమిస్ట్ డేవిడ్ బెర్గ్‌మాన్ వ్యాఖ్యానించారు.

ఈ ఊహాగానాలపై బీఎన్‌పీ వర్గాలు ఆచితూచి స్పందించాయి. ఎన్డీటీవీతో మాట్లాడుతూ తారిక్ రహ్మాన్ సన్నిహిత సలహాదారు హుమయూన్ కబీర్, "తారిక్ రహ్మాన్ సమగ్ర పాలనకు కట్టుబడి ఉన్నారు. దేశంలోని అత్యుత్తమ మేధావుల సేవలను వినియోగించుకోవాలని ఆయన భావిస్తున్నారు. యూనస్‌తో చర్చలు జరిగాయి కానీ, ఏ పదవీ ఖరారు కాలేదు. రాజకీయాల్లో ఏదీ అసాధ్యం కాదు, దేశ ప్రయోజనాల దృష్ట్యా ఉత్తమ నిర్ణయం తీసుకుంటారు" అని పేర్కొన్నారు. అయితే, ఈ ప్రచారాన్ని మహ్మద్ యూనస్ కార్యాలయం ఖండించింది. ఆయన ప్రెస్ సెక్రటరీ షఫీకుల్ ఆలం మాట్లాడుతూ, "యూనస్‌కు రాజకీయాల్లోకి వచ్చే ఆసక్తి ఎంతమాత్రం లేదు. ఆయన ఏ రాజ్యాంగ పదవినీ ఆశించడం లేదు. తన పాత బాధ్యతల్లోకి తిరిగి వెళతారు. పేదరికం, నిరుద్యోగం, కర్బన ఉద్గారాలు లేని సమాజం అనే తన 'త్రీ జీరోస్' లక్ష్య సాధన కోసం పనిచేస్తారు. కొత్త సామాజిక వ్యాపారాలు ప్రారంభిస్తూ, యువతతో కలిసి పనిచేయడానికే ఆయన ప్రాధాన్యత ఇస్తారు" అని స్పష్టం చేశారు. తన పరిమిత కాలంలో దేశంలో శాంతి, స్థిరత్వం తీసుకురావడంలో యూనస్ సఫలమయ్యారని, ఇప్పుడు బాధ్యతలను కొత్త ప్రభుత్వానికి అప్పగించి రాజకీయాల నుంచి పూర్తిగా వైదొలగనున్నారని ఆయన వివరించారు. దీంతో యూనస్ రాజకీయ భవిష్యత్తుపై వస్తున్న ఊహాగానాలకు తెరపడినట్లయింది.

# బంగ్లా నూతన ప్రధాని ప్రమాణ స్వీకారానికి భారత్ ప్రతినిధిగా స్పీకర్ ఓం బిర్లా

- మొదటి పేజీ తరువాయి

బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ కీలక కార్యక్రమంలో స్పీకర్ పాల్గొనడం ఇరు దేశాల ప్రజల మధ్య ఉన్న బలమైన, చిరకాల స్నేహానికి నిదర్శనమని విదేశాంగ శాఖ తెలిపింది. "చరిత్ర, సంస్కృతి, పరస్పర గౌరవంతో ముడిపడి ఉన్న పొరుగు దేశంగా, తారిఖ్ రెహమాన్ నాయకత్వంలో ఏర్పడుతున్న ఎన్నికైన ప్రభుత్వాన్ని భారత్ మనస్ఫూర్తిగా స్వాగతిస్తోంది. ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి ఉన్న బంగ్లాదేశ్‌కు మా మద్దతు ఎల్లప్పుడూ ఉంటుంది" అని ప్రకటనలో పేర్కొంది.

ఫిబ్రవరి 12న 300 స్థానాలకు గాను 299 స్థానాలకు పార్లమెంటరీ ఎన్నికల పోలింగ్ జరిగింది. ఇప్పటివరకు ప్రకటించిన ఫలితాల ప్రకారం, బీఎన్‌పీ 209 సీట్లు గెలుచుకుంది. మరోవైపు, జమాత్-ఎ-ఇస్లామీ 68 స్థానాలు కైవసం చేసుకుంది. ప్రముఖ బంగ్లాదేశ్ పత్రిక 'ప్రొథోమ్ ఆలో' కథనం ప్రకారం, ఫలితాలు నిలిపివేసిన రెండు నియోజకవర్గాల్లోనూ బీఎన్‌పీ అభ్యర్థులే ఆధిక్యంలో ఉన్నారు.

ఫిబ్రవరి 17న జాతీయ సంసద్ భవన్‌లో కొత్తగా ఎన్నికైన సభ్యులతో చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఎ.ఎం.ఎం. నసీరుద్దీన్ ప్రమాణం చేయించనున్నారు. దాదాపు 35 ఏళ్ల తర్వాత బంగ్లాదేశ్‌కు ఒక పురుషుడు ప్రధానమంత్రి కానున్నారు. అయితే, గత 18 నెలల తాత్కాలిక ప్రభుత్వ హయాంలో పెరిగిన అశాంతి, తీవ్రవాదాన్ని అధిగమించడం కొత్త ప్రభుత్వానికి అతిపెద్ద సవాల్‌గా నిలవనుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# కోవా బన్ వ్యాపారి వలీకి అండగా ఉంటాం

- మొదటి పేజీ తరువాయి

'ఫుడ్ జిహాద్' చేస్తున్నావంటూ ఆరోపణలు చేశారు. అంతేకాకుండా, అతడితో బలవంతంగా కోవా బన్ తినిపించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. ఈ వీడియోపై స్పందించిన నారా లోకేశ్, తన అధికారిక ఎక్స్ ఖాతా ద్వారా ఒక పోస్ట్ చేశారు. "ప్రియమైన సోదరుడు వలీ గారూ, మీకు ఈ బాధ కలిగినందుకు చాలా విచారంగా ఉంది. ఇలాంటి విభజనకరమైన, మతతత్వ ప్రవర్తనకు మన తెలుగు సమాజంలో చోటు లేదు. మన సమాజం ఎల్లప్పుడూ సామరస్యం, పరస్పర గౌరవం, సోదరభావంతో నిలిచింది" అని లోకేశ్ పేర్కొన్నారు.

అంతేకాకుండా, "త్వరలో మిమ్మల్ని కలిసి మీ ఫేమస్ కోవా బన్ రుచి చూడాలని ఎదురుచూస్తున్నాను! మనమంతా కలిసి ఉందాం" అంటూ వలీకి భరోసా ఇచ్చారు. లోకేశ్ స్పందనపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# అమెరికాతో ట్రేడ్ డీల్:

## ప్రధాని మోదీకి రాహుల్ గాంధీ 5 ప్రశ్నలు

- మొదటి పేజీ తరువాయి

ఆదివారం సోషల్ మీడియా వేదికగా ప్రధాని నరేంద్ర మోదీకి ఐదు సూటి ప్రశ్నలు సంధించారు. ఈ వివాదాస్పద ఒప్పందంపై ప్రభుత్వం స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ వాణిజ్య ఒప్పందం వల్ల జన్యుపరంగా మార్పు చేసిన (జీఎం) పంటలు, సోయా రైతులపై పడే ప్రతికూల ప్రభావాల గురించి రాహుల్ గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో రైతులకు అందుబాటులో ఉన్న రక్షణ కవచాలను కేంద్ర ప్రభుత్వం తొలగిస్తోందని ఆరోపించారు. ఈ ఒప్పందం కేవలం నేటి సమస్య కాదని, భవిష్యత్తులో భారత వ్యవసాయ వ్యవస్థపై మరో దేశానికి దీర్ఘకాలికంగా పట్టును అప్పగించడమేనని ఆయన విమర్శించారు. రైతుల ప్రయోజనాలను కాపాడాలని డిమాండ్ చేస్తూ, ప్రధాని మోదీ సమాధానం చెప్పాలంటూ రాహుల్ గాంధీ ఈ ఐదు ప్రశ్నలను లేవనెత్తారు.

1. డీడీజీ (డిస్టిల్లర్స్ డ్రైడ్ గ్రెయిన్) దిగుమతి చేసుకోవడం వెనుక అసలు ఉద్దేశం ఏమిటి? అంటే, అమెరికా జీఎం మొక్కజొన్నల నుంచి తీసిన ధాన్యాన్ని మన పశువులకు మేపడమేనా? ఇది మన పాల పరిశ్రమను అమెరికా వ్యవసాయ వ్యవస్థతో అనుసంధానం చేయదా?
2. జీఎం సోయా నూనె దిగుమతులకు అనుమతిస్తే.. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్‌తో పాటు దేశవ్యాప్తంగా ఉన్న మన సోయా రైతుల పరిస్థితి ఏంటి? మరోసారి ధరల పతనాన్ని వారు ఎలా తట్టుకుంటారు?
3. మీరు చెబుతున్న 'అదనపు ఉత్పత్తులు' జాబితాలో ఏముంటాయి? పప్పుధాన్యాలు, ఇతర సున్నితమైన పంటలను కూడా కాలక్రమేణా అమెరికా దిగుమతులకు తెరవాలనే ఒత్తిడికి ఇది సంకేతమా?
4. 'వాణిజ్యేతర అడ్డంకులు' తొలగించడం అంటే ఏమిటి? జీఎం పంటలపై భారత్ తన వైఖరిని నీరుగార్చాలా? సేకరణను బలహీనపరచాలా? లేదా భవిష్యత్తులో కనీస మద్దతు ధర, బోనస్‌లను నిర్వీర్యం చేయాలా?
5. ఒక్కసారి ఈ తలుపు తెరిస్తే, అది ఏటా మరింత పెద్దది కాకుండా ఎలా నివారిస్తాం? రైతులకు తగిన రక్షణ కవచాలు ఉంటాయా? లేక ప్రతి చర్చలోనూ మరిన్ని పంటలను బేరసారాలకు పెడతారా?

ఈ ప్రశ్నలకు జవాబులు ఇవ్వాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు.

# 'వికసిత్ భారత్' నిర్మాణానికి ఏపీ బడ్జెట్ పునాది

- మొదటి పేజీ తరువాయి

సంపద సృష్టి, అభివృద్ధి, సంక్షేమం ఆధారంగా బడ్జెట్ రూపొందించారు. రూ.3.32 లక్షల కోట్లతో బడ్జెట్ ప్రతిపాదించడం సాహసోపేతమైన చర్య. రెవెన్యూ లోటును 1.86 శాతానికి పరిమితం చేయడం ఆర్థిక క్రమశిక్షణకు నిదర్శనం. 'వికసిత్ ఏపీ' ద్వారా 'వికసిత్ భారత్' నిర్మాణానికి ఈ బడ్జెట్ పునాది వేస్తోంది" అని మాధవ్ అన్నారు.

# జనసేనకు భారీ విరాళం ప్రకటించిన పవన్ కల్యాణ్

- మొదటి పేజీ తరువాయి

చేసుకుని, సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేసే వారిని "ఉద్యమి"గా గౌరవిస్తామని తెలిపారు. పార్టీ పోరాటానికి బలం చేకూర్చి, నవతరంలో ప్రేరణ కలిగించే వారిని "సాధక్"గా, పరోక్షంగా సమయం, ఆర్థికం, సాంకేతికం, సేవా, మేధో సహకారాలు అందించే వారిని "ప్రదాత"గా ఇకపై పిలుస్తామని పవన్ కల్యాణ్ ప్రకటించారు. జనసేన పార్టీ ప్రారంభంలో 150 మందితో మొదలైందని, 2021లో మొదటి విడత సభ్యత్వంలో 90 వేలు నమోదు అయ్యాయని పవన్ తెలిపారు. గత ఎన్నికల ముందు ఆ సంఖ్య 6 లక్షలకు చేరిందని... ఎన్నికల తర్వాత 12.98 లక్షల సభ్యత్వాలు సాధించామని ఆయన గుర్తుచేశారు. చిన్న వ్యాపారులు, కూలీలు, చదువుకున్నవారు అందరూ ఈ ప్రక్రియలో భాగస్వాములయ్యారని, పార్టీ ఆశయాలకు అనుగుణంగా నడిచేవారే ముఖ్యమని పవన్ కల్యాణ్ అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్, పార్టీ అధ్యక్షుల రాజకీయ కార్యదర్శి పిడుగు హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి, కార్యక్రమాల నిర్వహణ కమిటీ చైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. గత సభ్యత్వ నమోదులో అత్యధిక సభ్యత్వాలు చేసినవారి సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది.

### మా డబ్బు, గిఫ్ట్‌లు మాకివ్వండి:

### ఇంటింటికి వెళ్లి అడుగుతున్న ఓడిపోయిన అభ్యర్థులు

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో ఓడిపోయిన కొందరు అభ్యర్థులు తాము పోలింగ్‌కు ముందు పంచిన నగదు, చీరలు, ఇతర బహుమతులు ఇవ్వాలంటూ ఓటర్లను అడగటం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థులు ఓటర్లను ప్రభావితం చేయడానికి డబ్బుతో పాటు ఇతర బహుమతులు పంచుతుంటారు.

మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోని మూడుచింతలపల్లి పొన్నాల వార్డులో ఓ అభ్యర్థి తాను పంచిన వాటిని తిరిగివ్వాలని ఓటర్లను అడుగుతున్నారు. ఎన్నికలకు ముందు తాను ఇచ్చిన మందు, చీరలు, డబ్బు తిరిగి ఇవ్వాలని ఈ వార్డులో ఓడిపోయిన ఓ అభ్యర్థి అడుగుతున్నారు. సదరు అభ్యర్థి ఇంటింటికి తిరుగుతూ తన బహుమతులు వసూలు చేసుకునే ప్రయత్నం చేయడం గమనార్హం. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లోని తొమ్మిదవ వార్డులో కూడా ఓ అభ్యర్థి తనకు ఎవరెవరు ఓటు వేశారు, ఎవరు వేయలేదో ఇంటింటికి వెళ్లి లెక్కలు వేసుకుంటున్నారు. తనకు ఓటు వేయని వారు తాను ఇచ్చిన బహుమతులను తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని భువనగిరి మున్సిపాలిటీ లోనూ ఒకటో వార్డులో ఓడిపోయిన ఒక అభ్యర్థి తాను పంచిన చీరలు, హాట్ బాక్సులు తిరిగి ఇవ్వాలని ఇంటింటికి వెళుతున్నారు.

# తెలుగు రాష్ట్రాల్లో శివ నామస్మరణతో హోరెత్తుతున్న శైవ క్షేత్రాలుద

శివనామ స్మరణ చేస్తూ స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు. తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి కూడా భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి, స్వామివారి దర్శనం కోసం గంటల తరబడి క్యూలైన్లలో బారులు తీరారు. అలాగే, కాళేశ్వరంలోని ముక్తేశ్వర స్వామి ఆలయం, శ్రీశైలంలోని భ్రమరాంబికా మల్లికార్జున స్వామి ఆలయం, కీసర, వరంగల్‌లోని చారిత్రక శివాలయాలు భక్తజన సంద్రంగా మారాయి. 'హర హర మహాదేవ', 'శంభో శంకర' అంటూ భక్తులు చేస్తున్న జయజయధ్వానాలతో ఆలయ ప్రాంగణాలు దద్దరిల్లుతున్నాయి.

మహాశివరాత్రి సందర్భంగా ఆలయాల్లో రుద్రాభిషేకాలు, బిల్వార్చనలు, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు వైభవంగా జరుగుతున్నాయి. రాత్రివేళ శివపార్వతుల కల్యాణ మహోత్సవాలు, జాగరణ కోసం ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ ఆర్టీసీ (టీజీఎస్ఆర్టీసీ) పలు శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతోంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టారు. భక్తులకు తాగునీరు, మజ్జిగ వంటి సౌకర్యాలను కల్పించారు. శివపార్వతులు ఏకమైన ఈ పవిత్రమైన రోజున ఉపవాసం ఉండి, రాత్రంతా జాగరణ చేస్తే సకల పాపాలు తొలగి పుణ్యఫలం దక్కుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

# రైతులకు పూర్తి రక్షణ... రాహుల్ గాంధీ తప్పుదోవపట్టిస్తున్నాడు

- మొదటి పేజీ తరువాయి

ప్రారంభించిన అనంతరం ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై అమిత్ షా తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. పార్లమెంటులో నిలబడి రాహుల్ గాంధీ రైతుల ప్రయోజనాలను కాపాడతామని మాట్లాడటం నవ్వొస్తోందని ఎద్దేవా చేశారు. దేశ ప్రజలను తప్పుదోవ పట్టించడంలో కాంగ్రెస్‌కు సుదీర్ఘ చరిత్ర ఉందని, ఇప్పుడు వాణిజ్య ఒప్పందాల గురించి అబద్ధాలు ప్రచారం చేస్తోందని ఆయన ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో జరిగిన ప్రతి చర్చలోనూ రైతులు, పశుపోషకులు, మత్స్యకారుల ప్రయోజనాలకు ఎలాంటి హాని కలగకుండా సంపూర్ణ భద్రత కల్పించారని హామీ ఇచ్చారు. గత యూపీఏ ప్రభుత్వంతో పోలుస్తూ తమ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి చేసిన మేలును అమిత్ షా వివరించారు. మన్మోహన్ సింగ్ హయాంలో కేవలం రూ. 26,000 కోట్లుగా ఉన్న వ్యవసాయ బడ్జెట్, ప్రధాని మోదీ నాయకత్వంలో రూ. 1,29,000 కోట్లకు పెరిగిందని గుర్తుచేశారు. గత దశాబ్ద కాలంలో కనీస మద్దతు ధరకు ఆహార ధాన్యాల సేకరణ పదిహేను రెట్లు పెరిగిందని తెలిపారు. "70 ఏళ్లుగా కాంగ్రెస్ రుణమాఫీ గురించి మాట్లాడిందే తప్ప చేసిందేమీ లేదు. కానీ మా ప్రభుత్వం, రైతులు అప్పులపాలు కాకుండా ఉండేందుకు ఏటా రూ. 6,000 నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తోంది" అని ఆయన అన్నారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల వల్ల దేశీయ పాడి రంగం దెబ్బతింటుందన్న విమర్శలను కూడా ఆయన తిప్పికొట్టారు. ప్రభుత్వం పాడి ఉత్పత్తి రంగాన్ని బలహీనపరచలేదని, మరింత బలోపేతం చేసిందని స్పష్టం చేశారు. అన్ని ఒప్పందాలలోనూ పాడి రంగానికి పూర్తి రక్షణ కల్పించామని పేర్కొన్నారు. ఈ అంశంపై ఎక్కడైనా, ఎప్పుడైనా బహిరంగ చర్చకు రావాలంటూ రాహుల్ గాంధీకి సవాల్ విసిరారు. బీజేపీ యువమోర్చా అధ్యక్షుడు కూడా ఈ చర్చకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. గత నెలలో భారత్, యూరోపియన్ యూనియన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై చర్చలు ముగియడం, అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదరడం వంటి పరిణామాల నేపథ్యంలో అమిత్ షా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

# పరమేశ్వరుని ఆశీస్సులు ప్రజలందరిపైనా ఉండాలి

**-జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్.**

**కాకినాడ జిల్లా కిర్లంపూడి ఫిబ్రవరి 15:**పరమేశ్వరుని ఆశీస్సులు ప్రజలందరిపైనా ఉండాలని జగ్గంపేట నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ అన్నారు.కిర్లంపూడి, చిల్లంగి, పాలెం, సోమవరం, వేలంక, రామచంద్రాపురం,గ్రామాలలో ఉన్న శివాలయాలను భక్తి శ్రద్ధలతో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజల్లో పాల్గొని భక్తులతో కలిసి స్వామివారిని ప్రార్థించారు.

తుమ్మలపల్లి రమేష్ ప్రజల శ్రేయస్సు, రాష్ట్ర అభివృద్ధి కోసం దేవుని ఆశీర్వాదాలు కోరారు. ఆలయ అర్చకులు ఆయనకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కిర్లంపూడి మండలాధ్యక్షుడు గంధం ప్రభాకర్, చిల్లంగి ఆలయ ధర్మకర్త శివ నాగు శివ నాగు ఎల్లపు



దొరబాబు, దాడిచిన బుజ్జి, బోండానంది బాబు, నాగబోయిన శివ, చిక్కాల కల్కి భగవాన్, కాయల మణికంఠ, పాలెం బాబి, గోకేడ పండు, గంధం వంశీ జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే ఆనందరావు.





**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, ఫిబ్రవరి 15:**గ్రామీణ ప్రాంతంలో జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించడం క్రీడా క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వానికి దోహదపడతాయని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు.

ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన అరిగెల శ్రీ రంగయ్య మెమోరియల్' జాతీయ స్థాయి మెన్ అండ్ ఉమెన్ వాలీబాల్ టోర్నమెంట్‌ను అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఘనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వాన్ని ఇస్తాయన్నారు. జాతీయ స్థాయి పోటీలను గొల్లవిల్లిలో నిర్వహించడం.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ క్రీడారంగానికి, యువతకు పెద్దపీట చేస్తున్నారని వివరించారు. అలాగే డిప్యూటీ సీఎం శ్రీ పవన్ కళ్యాణ్ క్రీడల ద్వారా క్రమశిక్షణ అలవడుతుందని ఎప్పుడూ చెబుతుంటారన్నారు. ఈ టోర్నమెంట్‌లో పాల్గొన్న పురుష మరియు మహిళా క్రీడాకారులందరూ క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించి, ఉన్నత స్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, బీసీ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి శాంత కుమారి, రెడ్డి సుబ్రమణ్యం, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, ఆముడా చైర్మన్ అల్లాడి స్వామి నాయుడు, దేశంశెట్టి లక్ష్మీనారాయణ, మట్ట మహాలక్ష్మి ప్రభాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# అన్నవరం దేవస్థానంలో వైభవంగా 'కోటి తులసి పూజ

## హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ.



**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, ఫిబ్రవరి 15:**ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం శ్రీ శ్రీ శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానం వారు కోటి తులసి పూజ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే సత్యప్రభ రాజాకు ఆలయ మర్యాదలతో ఆలయ చైర్మన్ ఐ వి రోహిత్,ఈవో వేంద్ర త్రినాధరావు,దేవస్థాన అర్చకులు ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసిన



ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా నియోజకవర్గ ప్రజలకు,కూటమి నాయకులకు,కార్యకర్తలకు,మహా శివరాత్రి శుభాకాంక్షలు తెలియచేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వెన్నా (ఈశ్వరుడు) శివ,నియోజకవర్గ సిబిఎన్ ఆర్మీ కో ఆర్డినేటర్ యాళ్ల జగదీష్,శంఖవరం మండల టీడీపీ అధ్యక్షులు బద్ది రామారావు,అన్నవరం టీడీపీ నాయకులు వీర్ల సూరిబాబు,బొమ్మిడి సత్తిబాబు,రాజాల చిట్టిబాబు,యువ నాయకులు వెలుగుల నాని,సాదనాల లక్ష్మీ బాబు,కేళంగి జన,సత్య దీక్ష ప్రచార కర్త నల్లమిల్లి కృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఐలాపురం వెంకయ్య మృతికి కోనసీమ శాలివాహన సంక్షేమ సంఘం ఘన నివాళులు



**అంబాజీపేట, పెన్ పవర్, ఫిబ్రవరి 15:**శాలివాహన కుమ్మరికుల బాంధవుడు రాష్ట్ర శాలివాహన సంఘం అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ ఐలాపురం వెంకయ్య మృతికి కోనసీమ శాలివాహన సంక్షేమ సంఘం ఆదివారం ద్రిగ్భాంతిని వ్యక్తం చేసి మౌనంపాటించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆయన కుమ్మరి కులానికి ఎన్నో సేవలు అందించి ఎంతోమందికి ఆదర్శంగా నిలిచారని కులం గొప్పతనాన్ని చాటిన మహోన్నత వ్యక్తి ఒక మహా శిఖర కోల్పోవడం చాలా బాధాకరం అన్నారు. వెంకయ్య విజయవాడలో హోటల్ ఐలాపూర్ అధినేతగా ఉంటూ సంఘానికి ఎంతో సేవ చేసి కుమ్మరి పేద కుటుంబాలకు ఎంతగానో తోడ్పడ్డారని ఆయన మరణం శాలివానులకు ఎంతో లోటని కుల పెద్దను కోల్పోయామని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మానేపల్లి వీర బ్రహ్మం, కార్యదర్శి దాలిపర్తి భీమేశ్వరరావు, సంఘ సలహాదారుడు దొడ్డిపట్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు వెల్ల త్రిమూర్తుల సఖినేటిపల్లి పెద్దిరాజు పుల్లటికుర్తి రత్నం, ర్యాలీ శ్రీనివాస వడియార్ అధికార ప్రతినిధి ఆదుర్తి నారాయణమూర్తి, పాలకొల్లు వెంకటరమణ, చిరుతపూడి హేమలత, మంతెన శ్రీనివాస్ మంతెన లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# మురళీకృష్ణంరాజును కలసిన వైసిపి నాయకులు.



**కిర్లంపూడి/ప్రత్తిపాడు పెన్ పవర్ ఫిబ్రవరి 15:**పత్తిపాడు మండలం ధర్మవరం గ్రామంలో మురళీకృష్ణంరాజుగ నివాసంలో ప్రత్తిపాడు నియోజకవర్గం వైయస్సార్ సిపి నాయకులు, నరసాపురం పార్లమెంటు పరిశీలకులు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శ్రీ ముదునూరి మురళీకృష్ణంరాజును పలువురు వైసిపి నాయకులు కలసి మహాశివరాత్రి సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసారు. ఆయనను కలసిన వారిలో ప్రత్తిపాడు ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్,ప్రత్తిపాడు ఎంపీటీసీ సేంద్రిపు భాస్కర్ రావు,గోనగాల అజయ్,పెద్దిపాలెం సర్పంచ్ దేవర రమేష్,పత్తిపాడు 10వార్డ్ నెంబర్ తాళ్లపూడి బుజ్జి, వైఎస్ఆర్సిపి నాయకులు గంగబాబు తదితరులు ఉన్నారు.

# కిర్లంపూడి శివాలయంలో ముద్రగడ కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు.





**కిర్లంపూడి, పెన్ పవర్, ఫిబ్రవరి 15:** మాజీ మంత్రి, రాష్ట్ర పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యులు, ముద్రగడ పద్మనాభం దంపతులు, ప్రత్తిపాడు నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముద్రగడ గిరిబాబు దంపతులు కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా కిర్లంపూడిలోని చారిత్రాత్మక శ్రీ ఉమా వైద్యనాదేశ్వర ఆలయాన్ని సందర్శించి అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులతో కలిసి మొక్కులు చెల్లించుకున్నారు.ఈ సందర్భంగా ముద్రగడ పద్మనాభం, ముద్రగడ గిరిబాబు మాట్లాడుతూ ఆ పరమేశ్వరుని ఆశీస్సులు ప్రజలందరిపైనా ఉండాలని, ఆయన అనుగ్రహంతో ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు కలగాలని వారు కోరుకున్నారు

# కిర్లంపూడి మండలంలో ఘనంగా శివరాత్రి ఉత్సవాలు.



**-శివనామస్మరణతో మార్మోగిన శివాలయాలు**

**కిర్లంపూడి,పెన్ పవర్ ఫిబ్రవరి15:** మండలంలోని పలు గ్రామాల్లో శివరాత్రి ఉత్సవాలను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని భక్తులు తెల్లవారుజాము నుండి పవిత్ర స్థానమాచరించి శివాలయాలకు చేరుకోవడంతో ఆయా గ్రామ శివాలయాలు భక్తులతో కిటకిట లాడడమే కాకుండా, శివ నామస్మరణతో మారుమోగాయి. మండలంలోని భూపాలపట్నం గ్రామంలో ఏలా నది తీరానదించేసియున్న శ్రీ పర్వత వర్ధిని సమేత పంచాయతన శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు తరలి రావడంతో భక్తులతో ఆలయం కిటకిటలాడింది.ఆలయ నిర్వాహకులు, గ్రామ సర్పంచ్ వీరంరెడ్డి కాశీబాబు, సోదరులు ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నారు.మండల కేంద్రమైన కిర్లంపూడి ఉమా వైద్యనాదేశ్వరస్వామి ఆలయానికి, మండలంలోని వేలంక, వీరవరం, గోనేడ, పాలెం,పలు గ్రామాల్లో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

# పలు శివాలయాల్లో మంత్రి సుభాష్ ప్రత్యేక పూజలు



✷ మహాశివరాత్రి వేళ భక్తిజన సందోహంతో మారుమోగిన క్షేత్రాలు

**రామచంద్రపురం, ఫిబ్రవరి 15 పెన్ పవర్:** దక్షిణ కాశీగా ఖ్యాతిగాంచిన పంచారామాలలో అగ్రగణ్యమైన ద్రాక్షారామం శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంతో పాటు కోటిపల్లి, గొల్లపాలెం, రామచంద్రపురం, హసనబాద్ శివాలయాల్లో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాలయ ప్రాంగణాలు "హర హర మహాదేవడ శంభో శంకరడ" నినాదాలతో మారుమోగాయి. వేలాదిగా తరలివచ్చిన భక్తులు రాత్రి జాగరణ, లింగాభిషేకాలు, రుద్రాభిషేకాలు, అర్చనలు నిర్వహిస్తూ మహాశివరాత్రిని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ స్వామివారికి అభిషేకాలు, పుష్పార్చనలు సమర్పించి రాష్ట్ర ప్రజల ఆయురారోగ్యాలు, సుభిక్షం, శాంతి సమృద్ధి కోసం ప్రార్థించారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు, తాగునీరు, ప్రసాద పంపిణీ తదితర సౌకర్యాలు కల్పించారు. మంత్రి మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకున్నామని తెలిపారు. రాష్ట్రాన్ని సువర్ణాంధ్రగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ లు మంచి ఆరోగ్యంతో ఉండాలని స్వామివారిని కోరుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఈఓ దుర్గా భవాని, అర్చకులు, అధికారులు, శివభక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహాశివరాత్రి సందర్భంగా భీమేశ్వర క్షేత్రం భక్తి జ్వాలలతో దివ్య కాంతిని సంతరించుకుంది.

## ర్యాలి ఉమాకండలేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి వేడుకలు

✷ స్వామివారి దర్శనానికి పోటెత్తిన భక్తులు





**ఆత్రేయపురం పెన్ పవర్ ఫిబ్రవరి 16:** ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలోని 11వ శతాబ్దానికి చెందిన పురాతన శ్రీ ఉమాకండలేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించబడ్డాయి. తెల్లవారుజాము నుంచే మండలంలోని పలు గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణం అంతా శివనామస్మరణతో మార్మోగింది.
మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకాలు, లింగాభిషేకాలు, బిల్వార్చనలు అర్చకులు వెంకట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు పాలు, తేనె, కొబ్బరి నీరు, బిల్వదళాలతో అభిషేకాలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రంతా జాగరణ, భజనలు, శివపారాయణలు జరిగాయి.
భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నప్రసాదం పంపిణీ చేశారు. భారీగా తరలి వచ్చిన భక్తులను దృష్టిలో ఉంచుకుని ఆలయ కమిటీ ప్రత్యేక క్యూలైన్లు, తాగునీరు, విద్యుత్ వెలుగులు, పార్కింగ్ ఏర్పాట్లు చేసింది. స్వచ్ఛంద సేవకులు భక్తులకు సహాయ సహకారాలు అందించారు. శివరాత్రి సందర్భంగా ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొని భక్తులు హర్షం వ్యక్తం చేశారు.

## కోటిపల్లిలో "సత్యం వాసంశెట్టి ఫౌండేషన్" సేవలు

✷ మహాశివరాత్రి సందర్భంగా భక్తులకు ఘనంగా అన్నదానం





**రామచంద్రపురం/కె.గంగవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 15:** రామచంద్రపురం నియోజకవర్గంలోని కోటిపల్లిలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ ఛాయ సోమేశ్వర ఆలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో భక్తుల కోసం భారీగా అన్నదానం, మజ్జిగ పంపిణీ కార్యక్రమాలు నిర్వహించారు.
ఫౌండేషన్ చైర్మన్ సత్యం స్వయంగా పర్యవేక్షణ చేసి భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. మహాశివరాత్రి సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల కోసం ఏర్పాటు చేసిన అన్నదానం, త్రాగునీరు, మజ్జిగ పంపిణీ వంటి సేవలు వారికి ఎంతో ఉపశమనాన్ని కలిగించాయి. ఈ సందర్భంగా క్యూలైన్‌లో సొమ్మసిల్లి పడిపోయిన ఓ మహిళను గమనించిన వాసంశెట్టి సత్యం వెంటనే పరామర్శించి, తక్షణ వైద్యసహాయం అందేలా చర్యలు తీసుకోవడం భక్తుల ప్రశంసలు అందుకుంది. మహాశివరాత్రి పర్వదినాన భక్తులకు సేవ చేయడం పుణ్యంగా భావిస్తున్నామని, భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని ఫౌండేషన్ చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ జొన్నాడ బీమశంకరం, కూటమి పార్టీ నాయకులు మేడిశెట్టి రవికుమార్, సలాది రమేష్, నిడదవోలు సుబ్రహ్మణ్యం, గొడవర్తి రామకృష్ణ, వెంటూరు వీరాఘవ చౌదరి, కంచుమర్తి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## జనసేన నాయకత్వ స్ఫూర్తితో పాఠశాలకు ఫ్లోరింగ్ టైల్స్ విరాళం

దాతలను ఘనంగా సత్కరించిన పాఠశాల యాజమాన్యం



**కాజులూరు, పెన్ పవర్, ఫిబ్రవరి 15:** కాజులూరు మండల ప్రజాపరిషత్ మెయిన్ ప్రైమరీ స్కూల్లో 5వ తరగతి గది ఫ్లోరింగ్ టైల్స్ ఏర్పాటుకు జనసేన అధ్యక్షుడు కొణిదెల పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో, అన్యం శ్రీరామచంద్రమూర్తి ప్రేరణతో కాజులూరు జనసైనికులు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన దాతలుగా గొర్రెల సుధాకర్, పెంటపాటి పెద్దరాజు, పుల్లెపు నాని, పడాల పాండురంగ, కూటి రంజిత్ కుమార్, డాక్టర్ సుధాకర్, నామా శ్రీను, చోడిశెట్టి మధుబాబు పాల్గొని ఫ్లోరింగ్ టైల్స్ పనులకు విరాళం అందించారు. వారి సహకారంతో తరగతి గది నూతన రూపు సంతరించుకుంది. కార్యక్రమానికి యాళ్ళ వెంకటరమణ (సొసైటీ అధ్యక్షులు), యాళ్ళ సత్యనారాయణ (నీటి సంఘం అధ్యక్షులు) ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జనసేన నాయకులు యాళ్ళ రవి, యాళ్ళ వేణు, చోడిశెట్టి శ్రీను, బండారు సత్తిబాబు, అలాగే పాఠశాల చైర్మన్ ఎం.కామేశ్వరి, హెడ్‌మాస్టర్ ఎం.దుర్గారావు, ఉపాధ్యాయులు కె.వి.సత్యనారాయణ, వి. భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. జనసేన నాయకులు, జనసైనికులు కలిసి నూతనంగా తయారైన తరగతి గదిని ప్రారంభించారు. పాఠశాల అభివృద్ధికి దాతలు అందించిన సహాయం అభినందనీయమని యాజమాన్యం పేర్కొంది.

## శివ నామస్మరణతో శివాలయాలు పోటెత్తిన భక్తులు



**అంబాజీపేట, పెన్ పవర్, ఫిబ్రవరి 15:** మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని శివాలయాలు భక్తులు పోటెత్తారు. మాచవరం లో వేంచేసియున్న శ్రీ పార్వతి రాజేశ్వరస్వామివారి ఆలయంలో ఉదయం నుండి స్వామివారి కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్ దీప కాంతులతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి
శివలింగం పూలతో ప్రత్యేక అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. ఆలయప్రాంగణంలో మహిళలు ప్రమిదలతో దీపాలను వెలిగించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శింకున్నారు. ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేసారు. అలాగే మాచవరం, శ్రీ పార్వతీ మల్లేశ్వర స్వామి (కందులమల్లేశ్వరస్వామి) ఆలయం, కోఠివారిఅగ్రహారంలో వేంచేసియున్న శ్రీ భువనేశ్వరి సమేత విశ్వేశ్వర స్వామివారి మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి ని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ నిర్వహించారు.

## గ్రామాలకు భారతీయ బౌద్ధ దమ్మ వారసత్వ ప్రచార రధం

**అంబాజీపేట, పెన్ పవర్, ఫిబ్రవరి 15:** భారతీయ బౌద్ధ దమ్మ వారసత్వ ప్రచార రధం ను డా: బిఆర్ అంబేద్కర్ అంతిమ ఆశయం ప్రబుద్ధ భారతం ఆశయం ను ప్రజలలోని కి తీసుకెళ్ళడానికి ఈ ప్రచారరధం సాగుతుందని ప్రచార రధ నిర్వాహకులు తెలిపారు. ఆదివారం మండలంలోని పుల్లేటికుర్రు సెంటరు లో ఉన్న అంభేద్కర్ విగ్రహానికి పూల మాలంకరణ చేసి గ్రామ సర్పంచ్ జిల్లిబాలరాజు, నూకపెయ్యి చిన్న, కోట హనుమంతరావు జెండా తో ప్రచార రధంను ప్రారంభించారు. ఈ ప్రచార యాత్ర మండలంలోని పలు గ్రామాల్లో సాగింది. ఈ ప్రచారరధం వెంట బీర సురేష్, ఎన్ సుధాకర్, మట్టా వెంకట్రావు, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె వివి సత్యన్నారాయణ, బిబి ఆర్ ప్రసాద్, గిడ్లరమేష్, పెట్టా శ్రీను, గోసంగి శ్రీనివాసరావు, బొంతు బాలయోగి, చినబాబు, వై. నరేష్, చీకురు మెల్లికృష్ణమూర్తి, తరట్ల శివన్నారాయణ, గోసంగి కుమార స్వామి, అంబటి వెంకట్, డాన్ శ్రీను, నాగాబత్తుల సుబ్బారావు, కత్తుల బాబులు. పోలమూరి హరిప్రసాద్. గోసంగి సత్యనారాయణ చింతా రాజేద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## పండగ వాతావరణంలో మహాశివరాత్రి వేడుకలు



✷ భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు
✷ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ

**కాకినాడ పెన్ పవర్, ఫిబ్రవరి 15:** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నగరంలో పండగ వాతావరణం నెలకొన్నట్లు కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ తెలిపారు. నగరంలోని శివాలయాలకు భారీగా తరలివస్తున్న భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. మహాశివరాత్రి సందర్భంగా కమిషనర్ దంపతులు నగరంలోని శ్రీ అన్నపూర్ణ సమేత శ్రీ విశ్వేశ్వర స్వామి వారి దేవస్థానం ను సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనాలు అందజేశారు.
భక్తుల రాకపోకలను దృష్టిలో ఉంచుకుని పారిశుద్ధ్యం, తాగునీరు, వెలుగుదీపాలు వంటి మౌలిక సదుపాయాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు కమిషనర్ తెలిపారు. దేవస్థానం ఈవో శ్రీనివాస్ రామచంద్రరావు మాట్లాడుతూ, భక్తుల కోసం ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేసి, దాతల సహకారంతో తీర్థప్రసాదాల పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో పండితులు కామేశ్వర శర్మ, ఫెస్టివల్ ఆఫీసర్ శ్రీనివాసు రావు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## స్కౌట్స్ గైడ్స్ విద్యార్థుల సేవలు అమూల్యం




**కాజులూరు, పెన్ పవర్, ఫిబ్రవరి 15:** కాజులూరు పి.ఎం.శపి.ఎం.శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పి.ఎం.శ్రీ పథకం కింద స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్లు ఏర్పాటు చేయడం జరిగిందని ప్రధానోపాధ్యాయులు మార్ని విష్ణుమూర్తి తెలిపారు. స్కౌట్ టీచర్ జి. బుజ్జిబాబు, గైడ్ టీచర్ కె. గౌతమీ సుధలు ఉత్సాహవంతులైన విద్యార్థులను ఎంపిక చేసి శిక్షణ అందిస్తూ సేవా భావాన్ని పెంపొందించడం అభినంద నీయమన్నారు. మహాశివరాత్రి సందర్భంగా స్థానిక శివాలయంలో భక్తుల రద్దీ నియంత్రణ, కార్యక్రమాల నిర్వహణలో స్కౌట్స్ , గైడ్స్ విద్యార్థులు చురుకుగా పాల్గొని గ్రామ పెద్దల ప్రశంసలు పొందారని తెలిపారు. విద్యార్థి దశలోనే సేవా భావం అలవర్చుకోవడం ద్వారా ఉన్నత లక్షణాలు గల భావి భారత పౌరులుగా తీర్చిదిద్దబడతారని పేర్కొన్నారు. దేవాలయంలో సేవలందించిన స్కౌట్, గైడ్ టీచర్లు మరియు విద్యార్థులను పాఠశాల విద్యాదాత అన్యం శ్రీ రామచంద్రమూర్తి, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ పెంటపాటి పద్దరాజు, కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు అభినందించారు.

## శివనామస్మరణతో మార్మోగిన శివ క్షేత్రాలు



**రౌతులపూడి పెన్ పవర్ ఫిబ్రవరి 15.** ఆదిదేవుడు శివుడు మహాశివరాత్రి రోజునే లింగాకారంగా ఆవిర్భవించాడని శివ పురాణం లో ఉంది. శివ , దేవేరి పార్వతి వివాహం జరిగిన నాడే మహాశివరాత్రి గా అవిర్భవించిన రోజున అని భక్తుల యొక్క ప్రగాఢ విశ్వాసం. మహాదేవుని భక్తిశ్రద్ధలతో శివరాత్రి రోజున పూజించుట ద్వారా కోరిన కోరికలు తీరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. రౌతులపూడి మండలం లో శివ క్షేత్రాలైన స్థానిక రౌతులపూడి ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయంలోనూ, గంగవరం గ్రామం లో కొలువైన దారమల్లేశ్వర స్వామి ఆలయం వద్ద, శృంగవరం గ్రామంలో స్వయంభుగా వెలసిన నాగ ఉమా లింగేశ్వర ఆలయం వద్ద ఆదివారం వేకువజామున ఉదయం నాలుగు గంటల నుంచే ఆలయాల వద్ద పుణ్య స్నానాలుతో భక్తులతో పుణ్యక్షేత్రాలు కిటకిటలాడాయి. ఈ మూడు ఆలయాల దగ్గర శివనామ స్మరణం మార్మోగింది, మూడు ఆలయాల వద్ద ఆలయాల కమిటీ వారు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు కల్పించారు. ఆదిదేవుని దర్శనం పొందిన భక్తులకు చక్ర పొంగలి, పులిహార ప్రసాదంగా సేదతీరారు. గంగవరం ధార మల్లేశ్వర స్వామి ఆలయం వద్ద భక్తుల రద్దీ ఎక్కువగా కనిపించింది. మండలంలోప్రతి గ్రామం ఆలయ వద్ద కమిటీ వారు భక్తులకు అందుబాటులో ఉంటూ ఆలయానికి వచ్చే వాహన రద్దీ ని ఎలాంటి అవాంతరాలు జరగకుండా నివారించారు.

# డిజిటల్ విప్లవంతో ప్రజల వద్దకే సుపరిపాలన పార్టీ బలోపేతానికి


**ఎమ్మెల్యే ఆనందరావు పిలుపు**



**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, ఫిబ్రవరి 15:** ప్రతి గ్రామంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పార్టీ కార్యక్రమాలు మై డిడిపి యాప్ ద్వారా ప్రజలకు అవగాహన. కార్యక్రమం అమలాపురం హౌసింగ్ బోర్డు కాలనీలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద మై టిడిపి యాప్ ప్రచార పోస్టర్‌ను అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆవిష్కరించారు. పార్టీ కార్యకర్తలకు, నాయకులకు ఆయన దిశానిర్దేశం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ

నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో, ప్రతి కూడలిలో మై డిడిపి యాప్ పోస్టర్లను ప్రదర్శించి ప్రజల్లో అవగాహన కల్పించాలని అభివృద్ధిని టెక్నాలజీతో జోడించడంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విజన్‌తోనే ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధిని ప్రతి గడపకూ చేరవేసేలా ఈ యాప్ రూపొందించబడిందన్నారు.

యువతకు మార్గదర్శి, మంత్రి నారా లోకేష్ పార్టీని డిజిటల్‌గా బలోపేతం చేస్తూ, కార్యకర్తలకు, ప్రజలకు నిరంతరంఅందుబాటులో ఉండేలా ఒక అద్భుతమైన వేదికను అందించారు. పార్టీ తీసుకునే నిర్ణయాలు, కార్యక్రమాలు, ప్రభుత్వ అభివృద్ధి సమాచారం ఇకపై అధికారికంగా మై టిడిపి యాప్ ద్వారా నేరుగా మీకు అందుతుంది. ఎక్కడా తప్పుడు ప్రచారాలకు తావులేకుండా యథార్థమైన సమాచారాన్ని తెలుసుకోవచ్చని ఆయన అన్నారు. రాష్ట్ర స్థాయి నుండి బూత్ లెవల్ లీడర్స్ వరకు, చిట్టచివరి కార్యకర్త వరకు పార్టీకి సంబంధించిన ప్రతి అధికారిక సమాచారం ఇకపై నేరుగా' యాప్‌లోనే వస్తుంది. పార్టీ ఆదేశాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, నియోజకవర్గ అభివృద్ధి వార్తలు ఎప్పటికప్పుడు తెలుసుకోవడానికి ఈ యాప్ ఒక డిజిటల్ వారధిలా పనిచేస్తుందని ఎమ్మెల్యే అన్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా సమాచారం నేరుగా మీకే అందుతుంది. పార్టీ కార్యకర్తలు, సోషల్ మీడియా వారియర్స్ అందరూ వెంటనే తమ మొబైల్స్‌లో మై టిడిపి యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకుని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ అందిస్తున్న సుపరిపాలనను, అభివృద్ధిని ప్రతి ఇంటికీ డిజిటల్ రూపంలో చేరవేయాలన్నారు.



## అభివృద్ధి సంక్షేమాల డబుల్ ఇంజన్ బడ్జెట్



**ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ**

**జగ్గంపేట, పెన్ పవర్, ఫిబ్రవరి 15 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సారథ్యంలోని కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026-27 ఆర్థిక సంవత్సర బడ్జెట్ అద్భుతమని జగ్గంపేట ఎమ్మెల్యే, టిటిడి బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ కొనియాడారు. ఆదివారం స్థానిక రావులమ్మ నగర్ లోని టిడిపి కార్యాలయంలో ఆయన పత్రిక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రూ.3,32,205 కోట్లతో రూపొందించిన ఈ బడ్జెట్ అటు మౌలిక సదుపాయాల కల్పనను, ఇటు పేదల సంక్షేమాన్ని సమతుల్యం చేస్తూ ఒక చారిత్రాత్మక ముందడుగుగా అభివర్ణించారు. సామాన్యుడి ఆశలు, ఆకాంక్షలకు ప్రతిరూపంగా నిలిచిన ఈ బడ్జెట్ రాష్ట్ర భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. 11 మంది సభ్యులతో 11వ తేదీన 11 నిమిషాలు మాత్రమే ఉన్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు ప్రజా సమస్యలపై కాకుండా తమకు ప్రతిపక్ష హోదా కావాలని అడగడం చిన్నపిల్లల ఆటలో అరటిపండు మాదిరిగా ఉందని ప్రతిపక్ష హోదా ప్రజలు ఇవ్వాలని మిమ్మల్ని ప్రజలు ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా చేశారని గుర్తించుకోవాలని అన్నారు. రాష్ట్రాన్ని మూడు జోన్లుగా విభజించి జోన్ 1 లో ఉన్న మన ప్రాంతానికి 28 వేల కోట్లు కేటాయించి శ్రీకాకుళం నుండి తూర్పుగోదావరి జిల్లా వరకు అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించారని అన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై ప్రభుత్వం చూపిన ప్రత్యేక శ్రద్ధను ఆయన ప్రశంసించారు. గత ఏడాది పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలకు రూ. 18,848 కోట్లు కేటాయించగా, ఈసారి ఆ మొత్తాన్ని ఏకంగా రూ. 22,942 కోట్లకు పెంచడం ద్వారా పల్లెల రూపురేఖలు మారనున్నాయని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పేర్కొన్నారు. ముఖ్యంగా జన వనరుల శాఖకు 28వేల కోట్లు రూపాయల కేటాయించి రాష్ట్రంలో అన్ని నీటిపారుదల ప్రాజెక్టులను పూర్తిచేసే లక్ష్యంతో ఉన్నారని ముఖ్యంగా పోలవరం ప్రాజెక్టు 91 శాతం పూర్తి చేసుకోవడం జరిగిందని నూటికి నూరు శాతం చంద్రబాబు నేతృత్వంలోనే పూర్తవుతుందని అన్నారు. మన ప్రాంతంలో తాళ్లూరు లిఫ్ట్ కు 52 కోట్ల రూపాయలు మంజూరై ఉన్నాయని తొందరలోనే శంకుస్థాపన కార్యక్రమం కూడా నిర్వహిస్తామని అన్నారు. పవన్ కళ్యాణ్ నేతృత్వంలో గ్రామీణ అభివృద్ధి శాఖకు అధిక శాతం నిధులు కేటాయించి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే కాకుండా, గ్రామీణ రోడ్లు పూర్తి చేసుకోవడం జరుగుతుందని అన్నారు. ప్రజా ఆరోగ్యం, సామాజిక భద్రత విషయంలో కూటమి ప్రభుత్వం రాజీపడలేదని జ్యోతుల నెహ్రూ స్పష్టం చేశారు. ప్రతి ఇంటికీ సురక్షితమైన మంచినీరు అందించాలనే సంకల్పంతో 'జల జీవన్ మిషన్'కు నిధులను రూ. 4,000 కోట్లకు పెంచడం ద్వారా మహిళల కష్టాలను తీర్చే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. అదేవిధంగా, నిరుపేదలైన వృద్ధులు, వితంతువులకు కొండంత అండగా నిలిచే 'ఎన్టీఆర్ భరోసా' పింఛన్ల కోసం రూ. 27,719 కోట్లు కేటాయించడం ద్వారా సామాజిక బాధ్యతను చాటుకుందన్నారు. రాజధాని అమరావతి నిర్మాణం, సాగునీటి ప్రాజెక్టుల పూర్తి వంటి భారీ లక్ష్యాలతో పాటు, ఎన్నికల హామీలైన 'సూపర్ సిక్స్' పథకాలకు నిధుల కేటాయింపు ద్వారా ప్రభుత్వం తన విశ్వసనీయతను నిలబెట్టుకుందని, ఈ బడ్జెట్ రాష్ట్ర ప్రగతి ప్రయాణంలో మైలురాయిగా నిలుస్తుందని ఎమ్మెల్యే నెహ్రూ పేర్కొన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధికి సహకరిస్తూ బడ్జెట్ ప్రవేశపెట్టిన ప య్యావుల కేశవ్ కి, అచ్చం నాయుడు కి ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో ఈ రాష్ట్రాన్ని మరింత ప్రగతి పథంలో నడిపిస్తామని నెహ్రూ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అడపా భరత్, ఎస్వీఎస్ అప్పలరాజు, జీను మణిబాబు, ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు, ఆత్మ చైర్మన్ పైడిపాల సూరిబాబు, పిల్లా చంటిబాబు, అనుకుల శ్రీకాంత్, సర్వసిద్ధి లక్ష్మణరావు, పీల మహేష్, వైబోగుల కొండబాబు యాదవ్, సాంబత్తుల చంద్రశేఖర్, దాసరి సీతారామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి కళ్యాణం



**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, ఫిబ్రవరి 15:**అమలాపురం రూరల్ మండలం పాత బండారులంక వేంచేసియున్న శ్రీ భద్ర కాళీ సమేత వీరభద్ర స్వామి ఆలయంలో పవిత్ర మహా శివరాత్రి సందర్భంగా స్వామి కళ్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ పురోహితులు అంకం నాగ మల్లేష్ రావు పర్యవేక్షణలో స్వామివారి కళ్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు.స్వామివారి కళ్యాణం పురస్కరించుకొని కాశీన బాల సుబ్రహ్మణ్యం దంపతులు చే మంగళ సూత్రములు. చుట్లు ఊరేగింపుగా సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

గత 75 ఏళ్ళ నుండి కళ్యాణం లు జరుగుతున్నాయని తెలిపారు. శ్రీ శైలం మాజీ ట్రస్టీ చింతా శంకర మూర్తి. చింతా మురళి. లక్కీశీశెట్టి నిత్యానందశీ. పాల్గొన్నారు. అనంతరం ప్రసాదశీ వితరణ కార్యక్రమం నిర్వహించారు.

## పలివెల ఉమాకొప్పులింగేశ్వర స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే బండారు

**భక్తిశ్రద్ధల మధ్య రథోత్సవాన్ని ప్రారంభించినారు**





**కొత్తపేట,పెన్ పవర్, పిబ్రవరి15;**మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం ప్రముఖ శైవక్షేత్రం పలివెల శ్రీ ఉమాకొప్పులింగేశ్వర స్వామివారి ఆలయాన్ని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు భక్తి శ్రద్ధలతో దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు వేదమంత్రాల నాదం మధ్య అర్చకులు, ఆలయ అధికారులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వామి, అమ్మవార్ల సన్నిధిలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. జగత్తుకే ఆదిదంపతులైన పార్వతీ పరమేశ్వరుల కృపా కటాక్షాలు రాష్ట్ర ప్రజలపై, నియోజకవర్గ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.అనంతరం మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించిన వైభవమైన రథోత్సవాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. భక్తులతో కలిసి రథాన్ని లాగుతూ తన భక్తి భావాన్ని చాటుకున్నారు. శివనామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా పాల్గొన్నారు.

## ఆత్రేయపురంలో కోడిపందాలపై పోలీసుల దాడి



**ఏడుగురు అరెస్ట్ నగదు, కోడిపుంజులు స్వాధీనం**

**ఆత్రేయపురం పెన్ పవర్ ఫిబ్రవరి 16:**ఆత్రేయపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆత్రేయపురం గ్రామ శివారులో కోడిపందాలు జరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో పోలీసులు ఆకస్మికంగా దాడి నిర్వహించారు. ఎస్సై ఎస్ రాము నేతృత్వంలో పోలీసు బృందం కోడిపందాలు ఆడుతున్న ఏడుగురిని పట్టుకుంది. వారి వద్ద నుంచి రూ.3,250 నగదు, రెండు కోడిపుంజులను స్వాధీనం చేసుకున్నారు. కోడిపందాల నిర్వహణ అక్రమమని, ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. పట్టుబడిన వారిపై సంబంధిత చట్టాల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

ప్రజలు అక్రమ జూద కార్యకలాపాలపై సమాచారం అందించాలని, చట్టవ్యతిరేక కార్యకలాపాలను అరికట్టడంలో సహకరించాలని పోలీసులు కోరారు.

## ఈనెల 14, 15 తేదీల్లో కాశీవిశ్వనాధం జ్ఞాపకార్ధం బాడ్మింటన్ టోర్నమెంట్..

**- బాడ్మింటన్ క్రీడాకారుడు సాత్విక్.**



**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్, ఫిబ్రవరి 15:** చిన్నతనం నుంచే షటిల్ బ్యాడ్మింటన్‌పై ఆసక్తి కనబరిచిన తన కుమారుడిని నిరంతరం ప్రోత్సహిస్తూ, శిక్షణ అందించి అంతర్జాతీయ స్థాయి క్రీడాకారునిగా తీర్చిదిద్దిన తండ్రి రుణాన్ని తీర్చుకునే ప్రయత్నంగా, ఆయన పేరిట టోర్నమెంట్ నిర్వహించడం అభినంద నీయమని పలువురు ప్రశంసిస్తున్నారు. అమలాపురానికి చెందిన స్వర్గీయ రంకిరెడ్డి కాశీ విశ్వనాధం జ్ఞాపకార్థంగా అంతర్జాతీయ బాడ్మింటన్ క్రీడాకారుడు సాత్విక్ సాయి రాజ్ ఫిబ్రవరి 14, 15 తేదీల్లో రెండు రోజుల పాటు బాడ్మింటన్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నారు.

ఈ సందర్భంగా సాత్విక్ మాట్లాడుతూ నేను ఈ స్థాయికి చేరుకోవడానికి నా తండ్రే ప్రధాన కారణం. ఆయనకు నేను ఎల్లప్పుడూ రుణపడి ఉంటాను. ఆయన స్ఫూర్తిని కొనసాగిస్తూ, కొంతైనా రుణం తీర్చుకునే అవకాశం రావడం ఆనందంగా ఉంది అని తెలిపారు.

ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రామీణంలో ఉన్న క్రీడాకారుల నైపుణ్యాన్నికి టోర్నమెంట్ లు దోహదపడాతాయని అన్నారు. అన్నారు. కోనసీమ ఆహారనిధి తరపున వ్యవస్థాపక అధ్యక్షుడు వీరంశెట్టి సతీష్, సభ్యులు, పంచాయతీ రాజ్ డిఈఈ అన్యం రాంబాబు సాత్విక్ సాయిరాజ్ కు జ్ఞాపికను అందజేసి అభినందనలు తెలిపారు.

## శివరాత్రి రోజు నుంచే ఈ బడ్జెట్ అమలులోకి శుభపరిణామం- ఎమ్మెల్యే ఆనందరావు



**అమలాపురం/అంబాజీపేట, పెన్ పవర్ ఫిబ్రవరి 15:**రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను ప్రజా సంక్షేమ బడ్జెట్‌గా అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. అమలాపురం టీడీపీ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో రాక్షస పాలన సాగించిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన తాజా బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేసే విధంగా ఉందని కొనియాడారు. గత ప్రభుత్వంలో పేదలకు సెంటిన్నర ఇళ్ల స్థలాలు ఇచ్చినా, గృహ నిర్మాణానికి అవసరమైన రుణాలు మంజూరు చేయలేదని, ఇల్లు నిర్మాణాలు పూర్తయిన దాఖలాలు లేవని ఎద్దేవా చేశారు. అయితే ప్రస్తుత బడ్జెట్‌లో పేదల కోసం ప్రత్యేకంగా 3 సెంట్ల ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో పాటు, గృహ నిర్మాణానికి రుణాలు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ప్రజలందరికీ శివరాత్రి రోజు నుంచే ఈ బడ్జెట్ అమలులోకి రావడం శుభపరిణామమని, శివుడి ఆశీస్సులతో రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని ఎమ్మెల్యే ఆనందరావు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అముడా చైర్మన్ అల్లాడ సోంబాబు, డి సి ఎం ఎస్ అధ్యక్షులు పెచ్చెట్టి చంద్రమౌళి, మార్కెట్ కమిటీ చైర్మన్ అధికారి జయలక్ష్మి, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబు రాజు, చింతా శంకర్ మూర్తి, మట్టా ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా 36వ ఏకాహ మహోత్సవం



**అంబాజీపేట, పెన్ పవర్, ఫిబ్రవరి 15:**మాచవరం, పంచాయతీ వీధి లో వేంచేసియున్న యువగణపతి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా 36వ ఏకాహ మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహాశివరాత్రి సందర్భంగా ఆలయ పురోహితులు కొడమంచిలి నాగేశ్వరరావు, ఫణి కుమార్ లు స్వామివారి ప్రత్యేక పూజలు నిర్వాహకులు. ఆలయ ప్రాంగణంలో దీపాలను వెలిగించారు. భక్తి సమాజం వారిచే భక్తి గీతాలు ఆలపించారు. ఆలయాన్ని విద్యుత్ దీపకాంతులతో ప్రత్యేక అలంకరణ చేసారు. నేడు ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహిస్తునట్లు ఆలయకమిటి సభ్యులు తెలిపారు. స్వామివారి కి బంగారపు కిరీటం చేయిస్తున్నని భక్తులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకొని ప్రసాదం స్వీకరించాలని అన్నారు.

## జగ్గంపేటలో ఘనంగా శివరాత్రి



**జగ్గంపేట, పెన్ పవర్, ఫిబ్రవరి 15:** జగ్గంపేట మండలం ఇర్రిపాక ఏలేరు నదీ తీరాన వేంచేసి ఉన్న భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి వారి దేవస్థానం, శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవస్థానం శివ కేశవుల క్షేత్రంలో మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. రాత్రి నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి దర్శనానికి బారులు తీరారు. జగ్గంపేట ఎమ్మెల్యే, టిటిడి బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ శివ కేశవులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఏలేరు నదిలో పుణ్య స్థానాల ఆశ్రయించి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఓం నమశ్శివాయ నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. ద్వాదశ జ్యోతిర్లింగాలను భక్తులు తమ స్వహస్తాలతో అభిషేకించి తన్మయత్వం పొందారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ ధర్మకర్త, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. మొన్ననే శ్రీనివాస కళ్యాణం, సత్య దేవుడి కళ్యాణం, శివ పార్వతుల కళ్యాణం నిర్వహించడంతో కాకినాడ జిల్లా వ్యాప్తంగా ఆలయానికి ఎంతో పాచుర్యం పొంది శివరాత్రి పర్వతరం సందర్భంగా వేలాదిగా భక్తులు తరలివచ్చి శివ కేసులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని ఆదివారం రాత్రి 10 గంటలకు లింగోద్భవ కాల అభిషేకాలు నిర్వహించారు.

## వైభవంగా కళ్యాణ వీరభద్రస్వామి 35వ వార్షికోత్సవం





**అంబాజీపేట, పెన్ పవర్, ఫిబ్రవరి 15:**శ్రీ భద్రకాళీ సమేత కళ్యాణ వీరభద్రస్వామి వారి 35వ వార్షికోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్థానిక కొర్లపాటివారిపాలెంలో బోనగిరి వెంకటేశ్వర్లు, విజయలక్ష్మి దంపతులచే స్వామివారి కళ్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు కళ్యాణం తిలకించి స్వామివారి ఆశీస్సులు పొందారు. స్వామివారి గ్రామోత్సవం సాంస్కృతిక నృత్యాలు, మేళతాళాలతో నిర్వహించారు. అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. రాత్రి భక్తి శ్రద్ధలతో వీరభద్రుని నామంతో భక్తులు నిప్పుల గుండం నిర్వహించారు.

## శాటిలైట్ సిటీ గ్రామంలో ముస్లిం మహిళలకు రంజాన్ తోఫా పంపిణీ



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 15:**రూరల్ మండలం శాటిలైట్ సిటీ గ్రామం లో పవిత్ర రంజాన్ మాసంను పురస్కరించుకొని జనాబ్ మీర్జా అన్వర్ బేగ్ సౌజన్యంతో తుమ్మా ఆధ్వర్యంలో ఆదివారం ముస్లిం మహిళల 100 కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ చేసారు. టిడిపి నాయకులు షేక్ సుభాన్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ యువ నాయకులు వైద్య విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోరంట్ల రవి రామ్ కిరణ్ ముఖ్యఅతిథిగా పాల్గొనడం జరిగింది. . ఈ కార్యక్రమం చారిటీ కోఆర్డినేటర్ ముజ్జిబుర్ రెహమాన్ సహకారంతో నిర్వహించడం జరిగింది.

ఈ సందర్బంగా రవిరామ్ కిరణ్ మాట్లాడుతూ, పవిత్రమైన రంజాన్ నెల ప్రారంభం శుభ సందర్బంగా రంజాన్ తోఫా ఏర్పాటు చేసిన పెద్దలకు అభినందనలు తెలిపారు. ప్రతీ ఒక్కరూ రంజాన్ నెలలో వారి శక్తీ కొలది పేదవారికి సహాయం అందంచాలని అల్లా కృప ప్రతీ ఒక్కరికి లభిస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రూరల్ మండల అధ్యక్షులు మత్సెటి శివ ప్రసాద్, సాటిలైట్ సిటీ గ్రామ కమిటీ అధ్యక్షులు నిచ్చెన కోళ్ల సత్తిబాబు, ఎం ఎస్ ఆర్.శ్రీను, బైరెత్తి.సరోజినీదేవి,పెంకే కోటేశ్వరరావు, యర్ర రాంబాబు, బుడంపర్తి నాగేశ్వరరావు, ఎస్ కే బాషా, కొమ్ముజు పెద్ది రాజు,మసీదు కమిటీ అధ్యక్షులు షేక్ మదీనా , కమిటీ సభ్యులు నయీమ్, భాష, రాజమండ్రి జనసేన నాయకులు షేక్ బాబ్జి తదితరులు పాల్గొన్నారు

## అత్యంత వైభవంగా మహాశివరాత్రి పర్వదినం.









- శివనామ స్మరణతో మార్మోగిన శివాలయాలు.
- శివాలయాలకు పోటెత్తిన భక్తులు.
- భక్తులకు మజ్జిగ, అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందించుటలో పోటీపడ్డ స్థానికులు.

**ఏలేశ్వరం, పెన్ పవర్, ఫిబ్రవరి 15:** మండల పరిధిలోని శివాలయాలు శివనామ స్మరణతో మార్మోగాయి. ఏలేరు నది తీరాన దక్షిణ కాశీగా పేరుందిన శ్రీ రాజరాజేశ్వరి సమేత శ్రీ రామలింగేశ్వర ఆలయానికి భక్తులు పోటెత్తారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఎవరు ఊహించని విధంగా భక్తులు ఆదివారం తెల్లవారుజాము నుంచే వేలాదిగా తరలివచ్చారు.ఏలేరు నదిలో పుణ్య స్థానాలు ఆచరించి, శివాలయంలో స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఆలయ కమిటీ దారి పొడవునా భక్తుల సౌకర్యార్థం పొడవైన భారీ కాడ్లు నిర్మించి శ్రీ రాజరాజేశ్వరి సమేత రామలింగేశ్వర స్వామి దర్శన అనంతరం ఆలయ ప్రాంగణంలో గల వివిధ ఉపాలయాలను దర్శించుకునే వీలు కల్పించారు. తెల్లారేసరికి గిరిజన మండలాల నుంచి , ఏలేశ్వరం చుట్టుపక్కల గ్రామాలనుంచి భక్తులు భారీగా తరలి రావడంతో ఇసుక వేస్తే రాలనంతగా రద్దీ ఏర్పడింది. అయినప్పటికీ నగర పంచాయతీ అధికారులు, రెవెన్యూ సిబ్బంది, పోలీస్ యంత్రాంగం పటిష్ట చర్యలు చేపట్టి, భక్తులకు సౌకర్యార్థం ప్రత్యేక స్నాన ఘట్టాలను ఏర్పాటు చేయడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఏ అవాంఛనీయ సంఘటన జరగకుండా పోలీస్ నిఘాలో మహాశివరాత్రి పర్వదిన పురస్కరించుకొని నిర్వహించబడిన స్వామివారి కళ్యాణం, తీర్థ మహోత్సవాలు ప్రశాంతంగా ముగిసాయి. అయితే ఉపవాసం ఉన్న భక్తులు శివాలయంలో జాతర మహోత్సవంలో పాల్గొనుటకు తరలి వస్తున్నారు. అలాగే పాత కంబాలపాలెం, జె. అన్నవరం, తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో తూర్పు లక్ష్మీపురంలో నిర్మింపబడిన నూతన ఆలయంలో మహాశివరాత్రి పర్వదినం ఘనంగా నిర్వహించారు. సిరిపురం గ్రామంలో శ్రీ ఉమా రామలింగేశ్వర శివాలయానికి తరలివచ్చిన భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

## దక్షిణ కాశీ వీరంపాలెం స్పటిక లింగ దర్శనంతో మారుమొగింన శివనామస్మరణతో శివాలయాలు







**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. ఫిబ్రవరి 15.** తాడేపల్లిగూడెం మండలం వీరంపాలెం లో మహాశివరాత్రి ఉత్సవాల ఘనంగా జరిగాయి స్పటిక లింగ దర్శనంతో భక్తుల శివనామస్మరణతో ఆలయం మారుమొగింది.

బాల త్రిపుర సుందరి పీఠాధిపతి గరిమెళ్ళ వెంకటరమణ సిద్ధాంతి ఆధ్వర్యంలో దాదాపు 70 వేల మంది భక్తులు శివరాత్రి సందర్భంగా విశ్వేశ్వరుని దర్శించుకున్నారు. కాశీ నమూనాలో వారణాసిలో విశ్వేశ్వరుని ఆలయం మాదిరిగా నిర్మించిన ఈ వీరంపాలెం ఆలయం రెండు దశాబ్దాలుగా జాతీయస్థాయి ప్రాధాన్యతను సంతరించుకుంది సామాన్య భక్తుల నుంచి వీఐపీలతో పాటు రాజకీయ నాయకులు అధికారులతో శివరాత్రి పర్వదినాన వేలాది భక్తులతో ఆలయం కలకల్లాడింది.

గరిమెళ్ళ సందీప్ ఏమని శశి కుమార్ లలిత తదితరుల బ్రహ్మత్వంలో వీరంపాలెంలో శివరాత్రి ఉత్సవాలు హోరెత్తయి.

భక్తుల తాకిడికి తగ్గట్టుగా ఆర్టీసీ బస్సులు ఉచిత బస్సులు కూడా ఏర్పాటు చేశారు బార్కెట్లు నిర్మించారు.

ఉచిత ప్రసాద వితరణ చేపట్టారు.

స్పటిక లింగ దర్శనానికి ప్రత్యేక క్యూ ఏర్పాటు చేశారు.

పోలీసు బందోబస్తు తో పాటు మెడికల్ క్యాంపు కూడా నిర్వహించారు.

ఎమ్మెల్యేల సందడి

పలువురు ఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధులు వీరంపాలెం విశ్వేశ్వరుని దర్శించుకున్నారు తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు ఇంకా పలువురు వీఐపీలు స్వామివారిని దర్శించుకున్నారు వీరంపాలెం శివాలయంలో ప్రత్యేక అభిషేకాలు హోమాలు నిర్వహించారు

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# 'రొమాంటిక్ మోడల్'కు గుడ్ బై చెప్పిన ఓపెన్ ఏఐ... యూజర్ల తీవ్ర విచారం

ప్రముఖ ఏఐ సంస్థ ఓపెన్ఏఐ తీసుకున్న ఓ నిర్ణయం ప్రపంచవ్యాప్తంగా పలువురు యూజర్లను తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. చాట్‌జీపీటీ యాప్‌లో అత్యంత ప్రాచుర్యం పొందిన జీపీటీ-4ఓ ఏఐ మోడల్‌కు యాక్సెస్‌ను కంపెనీ పూర్తిగా తొలగించింది. దీన్ని కేవలం ఒక టూల్‌గా కాకుండా, తమకు మానసికంగా తోడుండే స్నేహితుడిగా భావించే యూజర్లు ఈ పరిణామంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇతర ఏఐ మోడళ్ల కంటే జీపీటీ-4ఓ వెర్షన్ మరింత ఆప్యాయంగా, అర్థం చేసుకునే తత్వంతో, కాస్తంత రొమాంటిక్ గానూ ఉంటుందని యూజర్లు నమ్ముతారు. వాస్తవానికి, గత ఏడాది 2025 ఆగస్టులోనే దీన్ని తొలగించాలని ఓపెన్ఏఐ ప్రయత్నించగా, తీవ్ర వ్యతిరేకత రావడంతో పెయిడ్ యూజర్లకు మళ్లీ అందుబాటులోకి తెచ్చింది. అయితే, ఫిబ్రవరి 13న యాప్ యూజర్ల కోసం ఈ మోడల్‌ను శాశ్వతంగా




నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. సోమవారం నుంచి డెవలపర్‌లకు కూడా ఏపీఐ యాక్సెస్‌ను నిలిపివేయనుంది. ఈ నిర్ణయంపై యూజర్ల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. జీపీటీ-4ఓను కొనసాగించాలని కోరుతూ Change.orgలో పెట్టిన పిటిషన్‌పై ఇప్పటికే 20,000 మందికి పైగా సంతకాలు చేశారు. సిరాక్యూస్ యూనివర్సిటీ పరిశోధన ప్రకారం, 33 శాతం మందికి పైగా యూజర్లు దీన్ని ఒక టూల్ కంటే ఎక్కువగా భావిస్తుండగా, 22 శాతం మంది దీన్ని ఒక తోడుగా అభివర్ణించారు. చైనాలో చాట్‌జీపీటీపై నిషేధం ఉన్నప్పటికీ, వీపీఎన్ ద్వారా దీన్ని వాడే యూజర్లు సైతం తీవ్రంగా స్పందిస్తున్నారు. కొందరు తమ సబ్‌స్క్రిప్షన్‌లను రద్దు చేసుకుంటామని హెచ్చరిస్తుండగా, మరికొందరు ఓపెన్ఏఐ సీఈవో శామ్ ఆల్ట్‌మన్‌ను నిలదీస్తూ, మైక్రోసాఫ్ట్, సాఫ్ట్‌బ్యాంక్ వంటి ఇన్వెస్టర్లకు ఈ-మెయిల్స్ పంపుతున్నారు. డెవలపర్లు బేస్ మోడల్‌ను యాక్సెస్ చేయవచ్చని ఓపెన్ఏఐ చెబుతున్నా, అది తమకు ఇష్టమైన టెక్స్ట్-ఓన్లీ వెర్షన్ అంత బాగా లేదని ఫ్యాన్స్ వాదిస్తున్నారు. తమ ఆవేదనను కంపెనీ పట్టించుకోవడం లేదని వారు తీవ్ర నిరాశ వ్యక్తం చేస్తున్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

## 'ఆత్మీయ విందు' వెనుక అసలు ఫార్ములా ఇదే.. !



**హైదరాబాద్ పెన్ పవర్:** మంత్రి నారా లోకేష్ తన పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, వారి కుటుంబ సభ్యులతో ఆత్మీయ విందుకు శ్రీకారం చుట్టారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సమయంలోనే రోజూ ఒక పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని ఎమ్మెల్యేలు, వారి కుటుంబ సభ్యులతో ఆయన భేటీ అవుతున్నారు. ఇప్పటి వరకు మచిలీ పట్నం పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని ఎమ్మెల్యేలతోను, వారి కుటుంబాలతోనూ ఆయన భేటీ అయ్యారు. వారితో కలిసి విందు చేశారు. అయితే.. ఈ ఆత్మీయ విందుల వెనుక కేవలం కలిసి భోజనం చేయడం.. కబుర్లు చెప్పుకోవడమనే కాన్సెప్ట్ కాదు.. అత్యంత కీలకమైన ఫార్ములా వేరేగా ఉంది. కుటుంబాలకు కూడా పార్టీ తరపున భరోసా కల్పించాల న్నదే ప్రధాన వ్యూహం. వాస్తవానికి ఇప్పటి వరకు ఏ పార్టీలోనూ ఈ తరహా కార్యక్రమం చేయలేదు. చివర కు టీడీపీలోనూ ఎమ్మెల్యేల కుటుంబాలను ఒక వేదికపై చేర్చి నిర్వహించిన కార్యక్రమం లేదు. కానీ, తొలి సారి ఇలాంటి ఆలోచన చేశారు. దీని వెనుక ప్రధానంగా రెండు రీజన్లు ఉన్నాయి.

1) నారా లోకేష్ అందరికీ పరిచయం కావడం: ఇప్పటి వరకు టీడీపీ తరఫున చంద్రబాబు అందరికీ సుపరిచితమే. నారా లోకేష్ కూడా అంతే. అయితే.. దీనికి భిన్నంగా మరింత ఆత్మీయంగా టీడీపీ నేతలు, వారి కుటుంబాలతో మమేకం కావడం ద్వారా నారా లోకేష్‌ను పెద్దగా భావించే అవకాశం ఉంటుంది. ఇదేసమయంలో తమకు కీలక నాయకుడు పరిచయం అయ్యాడన్న సంతృప్తి కూడా ఆయా నేతల కుటుంబాల్లో ఉంటుంది. ఇది ఎన్నికల సమయానికి లోకేష్‌ను మరింత బలోపేతం చేస్తుంది.

2) అందుబాటులో ఉంటున్నామన్న భావన: తాను అందరికీ సులభంగా అందుబాటులో ఉంటున్నానన్న భావనను లోకేష్ కల్పించడం కూడా ఈ విందు సమావేశాలకు కీలకంగా మారింది. ముఖ్యమంత్రితో లేదా మంత్రులతో అపాయింట్‌మెంట్ దొరకడమే కష్టమైంది. ఇలాంటి సమయంలో లోకేష్ స్వయంగా ఎమ్మెల్యేల కుటుంబాలకు తన ఇంటి తలుపులు తీయడం ద్వారా వారిలో ప్రత్యేక మైన భరోసా కల్పించే ప్రయత్నం చేశారు. కుటుంబ సభ్యులతో ఉన్న అనుబంధం వల్ల, భవిష్యత్తులో రాజకీయంగా ఎటువంటి ఒడిదుడుకులు వచ్చినా ఆత్మీయతతో కూడిన ఐక్యత ఆ నాయకులను పార్టీతోనే ఉండేలా చేస్తుంది. ఇలా.. రెండు కీలక లక్ష్యాలతో నారా లోకేష్ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని పరిశీలకులు చెబుతున్నారు.

# నీ కోవా బన్ తినాలని ఉంది.. వలీకి అండగా లోకేష్

**హైదరాబాద్ పెన్ పవర్:** మేడారం జాతర వేదికగా మొదలైన "కోవా బన్" వివాదం ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో పెను సంచలనంగా మారింది. వ్యూస్ కోసం ఒక చిరు వ్యాపారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ప్రవర్తించిన యూట్యూబర్ల తీరుపై నెటిజన్లు భగ్గుమంటున్న వేళ ఏపీ మంత్రి నారా లోకేష్ ఈ ఘటనపై అత్యంత మానవీయంగా స్పందించారు. బాధిత వ్యాపారి వలీకి అండగా నిలుస్తూ లోకేష్






చేసిన ట్వీట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కర్నూలుకు చెందిన చిరు వ్యాపారి షేక్ షావలి పట్ల జరిగిన అవమానంపై నారా లోకేష్ ఎమోషనల్ అయ్యారు. "ప్రియమైన సోదరుడు వలీ.. మీరు ఎదుర్కొన్న ఈ పరిస్థితి నన్ను ఎంతగానో కలచివేసింది. మన తెలుగు సమాజం ఎల్లప్పుడూ సామరస్యం, పరస్పర గౌరవం, సోదరభావానికి ప్రతీక. ఇలాంటి విభజన రాజకీయాలకు, మతపరమైన వేధింపులకు ఇక్కడ చోటు లేదు. నేను త్వరలోనే మిమ్మల్ని కలుస్తాను.. మీరు తయారు చేసే ఫేమస్ కోవా బన్ రుచి చూడాలని ఎదురుచూస్తున్నాను." అని నారా లోకేష్ ఎక్స్ వేదికగా చేసిన ట్వీట్ సంచలనమైంది. అందరినీ కదిలించేలా ఉంది.

**అసలేం జరిగింది? వివాదం నేపథ్యమిదీ..**

మేడారం జాతరలో కర్నూలు జిల్లాకు చెందిన వలీ, కేవలం 10 రూపాయలకే కోవా బన్ విక్రయిస్తూ తన జీవనోపాధి సాగిస్తున్నాడు. అయితే కొందరు యూట్యూబర్లు అతని స్టాల్ వద్దకు వెళ్లి నాణ్యతపై అనుమానాలు వ్యక్తం చేస్తూ మతం రంగు పులుముతూ ప్రశ్నలతో వేధించారు. ఇంగ్లీషులో మాట్లాడుతూ భయపెట్టడం, ఆధార్ కార్డు అడగడం, ఎక్స్‌పైరీ డేట్ గురించి నిలదీయడం వంటి చర్యలతో వలీని ఇబ్బంది పెట్టారు. తాను ఎంతో కష్టపడి స్వచ్ఛమైన కోవా బన్ తయారు చేస్తున్నానని, తక్కువ లాభానికే పేదలకు అమ్ముతున్నానని కన్నీటి పర్యంతమయ్యాడు. ఆ సమయంలో చుట్టుముట్టిన కొందరు వలీ బండిని, సరుకును కూడా ధ్వంసం చేయడంతో దాదాపు రూ. 1 లక్ష నష్టం వాటిల్లింది.

**రాజకీయ పక్షాల సంఘీభావం**

లోకేష్‌తో పాటు పలువురు టీడీపీ నేతలు కూడా వలీకి మద్దతు ప్రకటించారు. పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ "ఆకలికి కులం ఉండదు.. ఆత్మగౌరవానికి మతం ఉండదు" అంటూ కష్టపడి పనిచేసే వ్యక్తిని వేధించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇక నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి కూడా వలీకి అండగా నిలుస్తూ, చిరు వ్యాపారుల పట్ల గౌరవం ఉండాలని పిలుపునిచ్చారు.

# జనసేనకు అలాంటి వారే కావాలి: పవన్




**హైదరాబాద్ పెన్ పవర్:** "జనసేన పార్టీ భావజాలాన్ని అర్థం చేసుకుని.. తమ కోసం కాకుండా సమాజం కోసం.. ఈ దేశం కోసం నిలబడే వారే నాకు కావాలి." అని జనసేన పార్టీ అధినేత, ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. కేవలం 150 మందితో ప్రారంభమైన జనసేన పార్టీలో.. ఇప్పుడు 14 లక్షల మంది ఉన్నారని తెలిపారు. రోజు రోజు కు పార్టీ అభివృద్ధి చెందుతోందని.. అదే సమయంలో భావజాలాన్ని కూడా అర్థం చేసుకునే నాయకులు ఎదగాలని ఆయన సూచించారు.

జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆదివారం ఆయన పార్టీ కేంద్ర కార్యాలయం (మంగళగిరి)లో పవన్ కల్యాణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన 2 కోట్ల రూపాయలను విరాళంగా ఇచ్చి.. జనసేన తొలి సభ్యత్వాన్ని తీసుకున్నారు. అనంతరం.. పలువురు నాయకులు, కార్యకర్తలు కూడా పార్టీ సభ్యత్వాన్ని తీసుకున్నారు. ం

ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేదిశగా ప్రతి ఒక్కరూ కష్టపడాలన్నారు. "నాయకుడు ఉన్నాడు. అన్నీ ఆయనే చూసుకుంటాడు.. అనే పరిస్థితిని విడిచిపెట్టండి. మీ వంతుగా పార్టీకి ఏం చేశారు? ప్రజలకు ఏం చేశారు? అనే విషయాలను భేరీజు వేసుకుని ఆదిశగా అడుగులు వేయండి" అని పవన్ కోరారు. పార్టీలో తాను కూడా సాధారణ కార్యకర్తనేనని.. వ్యాఖ్యానించారు. అందరినీ కలుపుకొని ముందుకు సాగాలని పార్టీ కార్యకర్తలకు సూచించారు.

**పార్టీలో కొత్త పేర్లు..**

జనసేనలో వివిధ విభాగాలకు సంబంధించి పనిచేస్తున్న కార్యకర్తలకు పవన్ కల్యాణ్ కొత్త పేర్లు సూచించారు.

1) ఉద్యమి: పార్టీ భావజాలాన్ని అర్థం చేసుకుని.. పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసేందుకు ముందుకు వచ్చి పార్టీ సభ్యత్వం తీసుకునే వారిని 'ఉద్యమి'గా పిలుస్తారు.

2) సాధక్: జనసేన పోరాటానికి మరింత బలం అందించి, నవతరంలో ప్రేరణ కలిగించి, పార్టీ సభ్యత్వం నమోదు చేసేవారిని 'సాధక్'గా పిలుస్తారు.

3) ప్రదాత: పార్టీ చేస్తున్న ప్రజా, రాజకీయ పోరాటానికి సమయాన్ని, ఆర్థిక, సాంకేతిక, సేవా, మేధా సహాయ సహకారాలు అందించే వారిని 'ప్రదాత'గా పిలవ నున్నారు.

# వలంటైన్స్ డేను నిషేధించిన దేశాలు.. కారణం ఇదే..

**హైదరాబాద్ పెన్ పవర్:** సనాతన ధర్మపు నేలైన భారతదేశంలో ఆధ్యాత్మిక చింతన, ధార్మిక నిష్ఠలు సామాజిక జీవనానికి పునాది. కుటుంబం, సంబంధాలు, పండుగలు అన్నీ సంప్రదాయంతో కలుపుకొని ఉంటాయి. ఒకప్పుడు 'వలంటైన్స్ డే' అనే పదం కూడా చాలా మందికి తెలియదు. పాశ్చాత్య సంస్కృతిలో భాగమైన ఈ రోజు, గ్లోబలైజేషన్, సోషల్ మీడియా, మార్కెటింగ్ ప్రభావంతో భారతీయ పట్టణ సంస్కృతిలోకి ప్రవేశించింది. అయినప్పటికీ, ఇది దేశవ్యాప్తంగా విస్తృతంగా జరుపుకునే పండుగగా మారలేదనేది వాస్తవం. కొన్ని నగరాల వరకే పరిమితమై ఉంది. ఈ నేపథ్యంలో మరో ఆసక్తికర అంశం ప్రపంచంలోని కొన్ని దేశాలు వలంటైన్స్ డేను అధికారికంగా లేదా ఆచరణలో నిషేధించడం. ముఖ్యంగా కఠిన మత నియమాలు అమలులో ఉన్న దేశాల్లో ఇది "సాంస్కృతిక దూరం" పేరుతో నియంత్రించబడింది.

**సౌదీ అరేబియా..**

సౌదీ అరేబియాలో ఇస్లామిక్ షరియా చట్టాల ప్రకారం పాశ్చాత్య సంస్కృతి ప్రభావాలను నియంత్రించే విధానం ఉంది. గతంలో వలంటైన్స్ డే సందర్భంగా గిఫ్టులు, ఎరుపు గులాబీలు విక్రయించడాన్ని కూడా నిలిపివేసిన సందర్భాలు ఉన్నాయి. అయితే ఇటీవలి సంవత్సరాల్లో కొన్ని పరిమిత సడలింపులు వచ్చినప్పటికీ, ఇది అధికారికంగా ప్రోత్సహించబడే పండుగ కాదు.

**ఉజ్బెకిస్తాన్‌లో..**

ఉజ్బెకిస్తాన్‌లో కూడా వలంటైన్స్ డేను ప్రోత్సహించరు. జాతీయ సంస్కృతి, సంప్రదాయాలకు విరుద్ధమని భావిస్తూ పాఠశాలలు, విద్యాసంస్థల్లో ఈ వేడుకలను నిరుత్సాహపరుస్తారు.

**ఇండోనేషియా..**

ఇండోనేషియాలోని కొన్ని ప్రావిన్సుల్లో మతపరమైన కారణాలతో వలంటైన్స్ డేను నిషేధించారు. యువతలో 'అనైతిక ప్రవర్తనకు దారితీస్తుంది' అన్న ఆందోళనలతో స్థానిక పరిపాలనలు కఠిన చర్యలు తీసుకున్న సందర్భాలున్నాయి.

**ఇరాన్..**

ఇరాన్‌లో పాశ్చాత్య సంస్కృతి ప్రభావాలను కట్టడి చేయడం ప్రభుత్వ విధానం. వలంటైన్స్ డేకు సంబంధించిన వస్తువుల అమ్మకాన్ని కొన్ని సందర్భాల్లో నియంత్రించారు. ప్రేమను వ్యక్తం చేసే పండుగల కంటే సంప్రదాయ ఇరానియన్ వేడుకలను ప్రోత్సహిస్తారు.

**పాకిస్తాన్..**

పాకిస్తాన్‌లో కోర్టు ఆదేశాలతో వలంటైన్స్ డేను బహిరంగంగా జరుపుకోవడాన్ని కొన్ని సంవత్సరాలు నిషేధించారు. ఇది ఇస్లామిక్ విలువలకు విరుద్ధమని అభిప్రాయపడ్డ మతపరమైన వర్గాల ఒత్తిడి కారణంగా జరిగింది.

**మలేషియా**

మలేషియాలో కూడా ముస్లిం యువత వలంటైన్స్ డే జరుపుకోవడం ఇస్లామిక్ బోధనలకు విరుద్ధమని మత సంస్థలు హెచ్చరికలు జారీ చేశాయి. కొన్ని ప్రాంతాల్లో నియంత్రణలు అమలయ్యాయి.



**భారత్‌లో పరిస్థితి ఏమిటి?**

భారతదేశంలో వలంటైన్స్ డేపై అభిప్రాయ భేదాలు ఉన్నాయి. కొందరు దీనిని ప్రేమను వ్యక్తపరచే సాధారణ సందర్భంగా చూస్తారు. మరికొందరు ఇది భారతీయ సంస్కృతికి సరిపడదని భావిస్తారు. అయితే భారత రాజ్యాంగం వ్యక్తిగత స్వేచ్ఛలకు ప్రాధాన్యం ఇస్తుంది. అందువల్ల ఇది పూర్తిగా నిషేధించబడలేదు.

ఇక్కడ ప్రధాన చర్చ సంస్కృతి వర్సెస్ స్వేచ్ఛ. ఒకవైపు సంప్రదాయ విలువలను కాపాడాలన్న భావన, మరోవైపు వ్యక్తిగత ఎంపికలకు గౌరవం ఇవ్వాలన్న ఆలోచన. గ్లోబల్ యుగంలో ఈ రెండు ధోరణుల మధ్య సమతుల్యం సాధించడమే సమాజానికి సవాలు. ప్రేమను వ్యక్తపరచడం ఏ ఒక్కరోజుకే పరిమితం కాదు. అదే సమయంలో సంస్కృతి పరిరక్షణ కూడా సమాజానికి అవసరం. చివరికి నిర్ణయం వ్యక్తిగతం మన విలువలు, మన విశ్వాసాలు, మన కుటుంబ సంప్రదాయాల ఆధారంగా తీసుకోవాల్సిందే.

# ప్రయాణ భద్రతను కట్టుదిట్టం చేస్తున్న చైనా.. కారణం ఇదే..

**హైదరాబాద్ పెన్ పవర్:** వాహన రంగంలో సరికొత్త డిజైన్‌లకు, ఫ్యూచరిస్టిక్ ఫీచర్లకు కేంద్రంగా నిలుస్తున్న చైనా ఇప్పుడు ఒక కీలక నిర్ణయం తీసుకుంది. స్టైల్, టెక్నాలజీ, ట్రెండ్‌ల కంటే భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టమైన సంకేతం పంపింది. కొద్ది రోజుల క్రితమే ఫ్లష్ డోర్ హ్యాండిల్స్‌ను నిషేధించిన చైనా ప్రభుత్వం, ఇప్పుడు హాఫ్ స్టీరింగ్ (యోక్ స్టైల్ స్టీరింగ్)పై కూడా కఠిన నిర్ణయం తీసుకుంది. 2027, జనవరి 1 నుంచి ఈ కొత్త నియమాలు అమల్లోకి వస్తున్నాయి.

**ఫ్లష్ డోర్ విషయంలో జాగ్రత్తలు..**

ఇటీవలి సంవత్సరాల్లో ఎలక్ట్రిక్ వాహనాలు, హైఎండ్ కార్లలో ఫ్లష్ డోర్ హ్యాండిల్స్, హాఫ్ స్టీరింగ్ వంటి ఫీచర్లు ఫ్యాషన్‌గా మారాయి. ఇవి వాహనానికి ఆధునిక రూపం ఇస్తాయని తయారీదారులు భావించారు. కానీ ప్రమాదాల సమయంలో ఇవే ప్రాణాలకు ముప్పు కలిగిస్తున్నాయనే ఆందోళన పెరిగింది. రోడ్డు ప్రమాదాల్లో ఫ్లష్ హ్యాండిల్స్ తలుపులు తెరుచుకోకుండా ఉండడం, రక్షణ సిబ్బందికి లోపలివారిని బయటకు తీసేందుకు ఇబ్బందులు కలిగించడం వంటి ఘటనలు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలోనే చైనా వాటిని బ్యాన్ చేసింది.

**స్టీరింగ్ కూడా మార్చనుందా?**

ఇప్పుడు హాఫ్ స్టీరింగ్ వ్యవస్థపై కూడా అదే విధమైన ఆందోళనలు వ్యక్తం అయ్యాయి. అధికారిక పరిశోధనల ప్రకారం.., ప్రమాదాల్లో డ్రైవర్లకు తగిలే గాయాల్లో సుమారు 46 శాతం స్టీరింగ్ వ్యవస్థ కారణమని తేలింది. ముఖ్యంగా హాఫ్ స్టీరింగ్ డిజైన్ వల్ల ఢీకొన్న సమయంలో గాయాల తీవ్రత పెరుగుతోందని నివేదికలు సూచించాయి. స్టీరింగ్ పూర్తి వృత్తాకారంలో లేకపోవడం వల్ల ఎమర్జెన్సీ సందర్భాల్లో వాహన నియంత్రణలో సమస్యలు తలెత్తుతున్నాయని నిపుణులు గుర్తించారు.

**వాహన పరిశ్రమకు హెచ్చరిక..**

చైనా తీసుకున్న ఈ నిర్ణయం వాహన పరిశ్రమకు ఒక హెచ్చరిక లాంటిది. డిజైన్ ప్రయోగాలు చేసేటప్పుడు భద్రతను రెండో స్థానంలో పెట్టకూడదనే సందేశం ఇందులో దాగి ఉంది. మార్కెట్లో ఆకర్షణ కోసం తీసుకొచ్చిన ఫీచర్లు, రోడ్లపై ప్రమాదకరంగా మారితే ప్రభుత్వాలు
జోక్యం చేసుకోవాల్సిందే. చైనా అదే చేసింది. ఈ నిర్ణయం ప్రపంచ ఆటోమొబైల్ రంగంపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. ఎందుకంటే చైనా ప్రపంచంలో అతిపెద్ద వాహన మార్కెట్. అక్కడ అమల్లోకి వచ్చే నియమాలు ఇతర దేశాల తయారీదారులపై కూడా ఒత్తిడి తెస్తాయి. భవిష్యత్తులో ఇతర దేశాలు కూడా భద్రతా ప్రమాణాలను పునఃసమీక్షించే అవకాశం ఉంది.

**స్పష్టమైన దిశను చూపుతున్న చైనా..**

మొత్తానికి, చైనా తాజా నిర్ణయం భద్రత విషయంలో ఒక స్పష్టమైన దిశను చూపుతోంది. వాహనం ఎంత ఆధునికంగా ఉన్నా, ప్రయాణికుడి ప్రాణం కంటే గొప్పది కాదు. టెక్నాలజీ, స్టైల్, ఇన్నోవేషన్ అన్నీ భద్రత తర్వాతే. 2027 నుంచి అమల్లోకి రానున్న ఈ నియమాలు వాహన రంగంలో భద్రతకు కొత్త ప్రమాణాలను స్థాపించవచ్చు.

# పాకిస్థాన్‌ను మట్టికరిపించిన భారత్...

# వరల్డ్ కప్ సూపర్-8లోకి గ్రాండ్ ఎంట్రీ

**టీ20 ప్రపంచకప్‌లో పాక్‌పై భారత్ ఘన విజయం**

**61 పరుగుల భారీ తేడాతో చిత్తుగా ఓడించిన టీమిండియా**

**భారత్ విజయంలో కీలకపాత్ర పోషించిన ఇషాన్ కిషన్ (77)**

**వరుసగా మూడో విజయంతో హ్యాట్రిక్.. సూపర్-8లోకి ప్రవేశం**

**భారత బౌలర్ల ధాటికి 114 పరుగులకే కుప్పకూలిన పాకిస్థాన్**



**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 ప్రపంచకప్‌లో భాగంగా జరిగిన హై-వోల్టేజ్ మ్యాచ్‌లో టీమిండియా అద్భుత విజయాన్ని అందుకుంది. తన చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను 61 పరుగుల భారీ తేడాతో మట్టికరిపించింది. కొలంబోలోని ఆర్. ప్రేమదాస స్టేడియంలో ఈరోజు జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టింది. ఈ విజయంతో గ్రూప్-ఏలో వరుసగా మూడో విజయంతో హ్యాట్రిక్ కొట్టింది. తద్వారా టోర్నమెంట్‌లో సూపర్-8 దశకు అధికారికంగా అర్హత సాధించింది. 176 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పాకిస్థాన్ ఆది నుంచే తడబడింది. భారత బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్‌కు పాక్ బ్యాటర్లు వరుసగా పెవిలియన్‌కు క్యూ కట్టారు. హార్దిక్ పాండ్య, జస్‌ప్రీత్ బుమ్రా ఆరంభంలోనే వికెట్లు తీసి పాక్‌ను కోలుకోలేని దెబ్బతీశారు. ఒక దశలో 13 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఉస్మాన్ ఖాన్ (44) ఒక్కడే ఒంటరి పోరాటం చేశాడు. అయితే, అతడు ఔటైన తర్వాత పాక్ ఇన్నింగ్స్ పేకమేడలా కూలిపోయింది. భారత బౌలర్లు మూకుమ్మడిగా రాణించడంతో పాకిస్థాన్ 18 ఓవర్లలో 114 పరుగులకే ఆలౌట్ అయింది. హార్దిక్, బుమ్రా, అక్షర్ పటేల్, వరుణ్ చక్రవర్తి తలా రెండు వికెట్లు తీయగా, కుల్దీప్ యాదవ్, తిలక్ వర్మ చెరో వికెట్ పడగొట్టారు. ఈ విజయంతో భారత్ గ్రూప్‌లో అగ్రస్థానంలో కొనసాగుతోంది.

అంతకుముందు, టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఆరంభంలోనే షాక్ తగిలింది. అభిషేక్ శర్మ డకౌట్‌గా వెనుదిరిగాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన ఇషాన్ కిషన్ పాక్ బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. కేవలం 40 బంతుల్లో 10 ఫోర్లు, 3 సిక్సర్లతో 77 పరుగులు చేసి మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. అతనికి తిలక్ వర్మ (25), కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (32) నుంచి మంచి సహకారం లభించింది. అయితే, మిడిల్ ఓవర్లలో హార్దిక్ పాండ్య (0) విఫలమవడంతో స్కోరు వేగం తగ్గింది. చివర్లో శివమ్ దూబే (17 బంతుల్లో 27), రింకు సింగ్ (4 బంతుల్లో 11) వేగంగా ఆడటంతో భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 175 పరుగుల గౌరవప్రదమైన స్కోరు సాధించింది. పాక్ బౌలర్లలో సైమ్ అయూబ్ 3 వికెట్లు పడగొట్టాడు.

ఇక, భారత్ గ్రూప్-ఏలో తన చివరి లీగ్ మ్యాచ్‌ను నెదర్లాండ్స్ తో ఈ నెల 18న అహ్మదాబాద్ లో ఆడనుంది.

# నేపాల్‌పై గెలిచి... దర్జాగా సూపర్-8 లోకి ప్రవేశించిన వెస్టిండీస్

- టీ20 ప్రపంచకప్‌లో నేపాల్‌పై వెస్టిండీస్ 9 వికెట్ల తేడాతో భారీ విజయం
- ఈ విజయంతో గ్రూప్-సి నుంచి సూపర్ 8 దశకు అర్హత సాధించిన విండీస్
- అజేయ హాఫ్ సెంచరీతో రాణించిన షాయ్ హోప్, హెట్‌మెయర్ మెరుపు ఇన్నింగ్స్
- బౌలింగ్‌లో 4 వికెట్లతో నేపాల్‌ను దెబ్బతీసిన జాసన్ హోల్డర్
- ఈ ఓటమితో టోర్నీ నుంచి అధికారికంగా నిష్క్రమించిన నేపాల్



**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 ప్రపంచకప్‌లో వెస్టిండీస్ జట్టు అద్భుత ప్రదర్శనతో సూపర్ 8 దశకు అర్హత సాధించింది. ఆదివారం ముంబైలోని వాంఖడే స్టేడియంలో జరిగిన గ్రూప్-సి మ్యాచ్‌లో నేపాల్‌పై 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బౌలింగ్‌లో, ఆ తర్వాత బ్యాటింగ్‌లో సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించిన కరీబియన్ జట్టు, ఈ టోర్నీలో నేపాల్ ప్రస్థానానికి ముగింపు పలికింది.టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న వెస్టిండీస్‌కు కెప్టెన్ నిర్ణయం సరైనదని బౌలర్లు నిరూపించారు. జాసన్ హోల్డర్ (4/27) అద్భుత బౌలింగ్‌తో నేపాల్ బ్యాటింగ్ ఆర్డర్‌ను దెబ్బతీశాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా, దీపేంద్ర సింగ్ ఐరీ (47 బంతుల్లో 58) ఒంటరి పోరాటం చేసి హాఫ్ సెంచరీ సాధించాడు. చివర్లో సోంపాల్ కమీ (15 బంతుల్లో 26) వేగంగా ఆడటంతో నేపాల్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 133 పరుగులు చేయగలిగింది.అనంతరం 134 పరుగుల సులభ లక్ష్యంతో బరిలోకి దిగిన వెస్టిండీస్‌కు ఓపెనర్ బ్రాండన్ కింగ్ (22) మంచి ఆరంభాన్ని ఇచ్చాడు. అతను ఔటైన తర్వాత క్రీజులోకి వచ్చిన షిమ్రాన్ హెట్‌మెయర్ (32 బంతుల్లో 46 నాటౌట్), మరో ఓపెనర్, కెప్టెన్ షాయ్ హోప్ (44 బంతుల్లో 61 నాటౌట్)తో కలిసి విధ్వంసం సృష్టించాడు. వీరిద్దరూ రెండో వికెట్‌కు అజేయంగా 91 పరుగులు జోడించడంతో విండీస్ కేవలం 15.2 ఓవర్లలోనే ఒక వికెట్ మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. విండీస్ కు ఇది వరుసగా మూడో విజయం కాగా, ఈ గెలుపుతో సూపర్ 8లో అడుగుపెట్టింది. మరోవైపు, ఆడిన మూడు మ్యాచ్ ల్లో ఓటములతో నేపాల్ టోర్నీ నుంచి అధికారికంగా నిష్క్రమించింది.

# టీ20 వరల్డ్ కప్: నమీబియాపై విజయంతో లీగ్ దశ ముగించిన అమెరికా



- టీ20 ప్రపంచకప్‌లో నమీబియాపై 31 పరుగులతో అమెరికా విజయం
- తొలుత బ్యాటింగ్ చేసిన అమెరికా 20 ఓవర్లలో 199 పరుగులు
- అర్ధ శతకాలతో రాణించిన సంజయ్ కృష్ణమూర్తి (68లి), మోనాంక్ పటేల్ (52)
- ఛేదనలో 168 పరుగులకే పరిమితమైన నమీబియా
- నమీబియా తరపున లౌరెన్ స్టీన్‌క్యాంప్ (58) పోరాటం విఫలం

**హైదరాబాద్ పెన్ పవర్:** ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లో భాగంగా నమీబియాతో జరిగిన మ్యాచ్‌లో అమెరికా 31 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో అమెరికా బ్యాటర్లు సంజయ్ కృష్ణమూర్తి, కెప్టెన్ మోనాంక్ పటేల్ అర్ధ శతకాలతో చెలరేగడంతో తొలుత భారీ స్కోరు నమోదైంది. అనంతరం లక్ష్య ఛేదనలో నమీబియా తడబడింది.టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అమెరికా, నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 199 పరుగుల భారీ స్కోరు చేసింది. కెప్టెన్ మోనాంక్ పటేల్ (30 బంతుల్లో 52) మెరుపు ఆరంభాన్ని అందించగా, చివర్లో సంజయ్ కృష్ణమూర్తి (33 బంతుల్లో 68 నాటౌట్) విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడాడు. అతని ఇన్నింగ్స్‌లో 6 సిక్సర్లు, 4 ఫోర్లు ఉన్నాయి. వీరిద్దరి ధాటికి అమెరికా సునాయాసంగా భారీ స్కోరు చేయగలిగింది. నమీబియా బౌలర్లలో విల్లెమ్ మైబర్గ్, గెరార్డ్ ఎరాస్మస్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. 200 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన నమీబియా, 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 168 పరుగులకే పరిమితమైంది. ఓపెనర్ లౌరెన్ స్టీన్‌క్యాంప్ (39 బంతుల్లో 58) ఒక్కడే అర్ధ శతకంతో పోరాడాడు. మిగతా బ్యాటర్ల నుంచి ఆశించిన సహకారం లభించలేదు. అమెరికా బౌలర్లలో షాడ్లీ వాన్ షాల్క్‌విక్ రెండు వికెట్లతో రాణించగా, సౌరభ్ నేత్రావల్కర్, అలీ ఖాన్, శుభమ్ రంజానె తలో వికెట్ తీసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు.కాగా, లీగ్ దశను అమెరికా విజయంతో ముగించింది. గ్రూప్-ఏలో ఉన్న అమెరికా మొత్తం 4 మ్యాచ్ లు ఆడి 2 విజయాలతో భారత్, పాక్ తర్వాత మూడో స్థానంలో ఉంది.

# సూపర్ స్టార్‌ని వెనక్కి నెట్టిన ఐకాన్ స్టార్!







జక్కన్న అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కించిన -బాహుబలి- సిరీస్ తరువాత స్టార్స్ చేసే ప్రతి సినిమా లార్జెన్ దెన్ లైఫ్ మూవీగానే చేయాలని చూస్తున్నారు. అలాంటి కథలనే ఎంచుకుంటున్నారు. బడ్జెట్ విషయంలోనూ ఏ మాత్రం వెనక్కి తగ్గడం లేదు. ప్రతీదీ భారీ స్థాయిలోనే ఉండేలా ప్లాన్ చేసుకుంటున్నారు. దీంతో సినిమా బడ్జెట్‌లు పతాక స్థాయికి చేరుకుంటున్నాయి. బడ్జెట్‌ని బట్టి స్టార్ల పారితోషికాలు కూడా చుక్కలని తాకుతుండటం తెలిసిందే. ఒకప్పుడు భారీ స్థాయిలో రికార్డు స్థాయి పారితోషికాలు అనేవి బాలీవుడ్ వరకే పరిమితంగా ఉండేవి. కానీ దక్షిణాదిలో పాన్ ఇండియా సినిమాల ట్రెండ్ మొదలయ్యాక అది దక్షిణాదికి కూడా పాకింది. ప్రపంచ సినిమాతో పోలిస్తే ఇండియాలోనే సినిమాల నిర్మాణం ఎక్కువ. సినిమాల హడావిడీ కూడా ఎక్కువే. బాలీవుడ్ టు టాలీవుడ్ వరకు స్టార్స్ కూడా ఎక్కువే. అయితే పాన్ ఇండియా సినిమాల ప్రవాహం పెరిగిన స్టార్స్ భారీ బ్లాక్ బస్టర్లని సొంతం చేసుకుంటున్న నేపథ్యంలో ఇండియాలో అత్యధికపారితోషికాన్ని అందుకుంటున్న టాప్ 3 స్టార్స్ ఎవరన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఈ జాబితాలో ఇండియా వైడ్‌గా నిలిచింది ముగ్గురు స్టార్స్. బాలీవుడ్ హీరో షారుక్ ఖాన్. టాలీవుడ్ స్టార్ అల్లు అర్జున్, కోలీవుడ్ సూపర్‌స్టార్ రజనీకాంత్. అత్యధిక పారితోషికాన్ని తీసుకుంటూ షారుక్ ఖాన్ మొదటి స్థానంలో నిలిచాడు. రెండవ స్థానంలో రజనీకాంత్‌ని వెనక్కి నెట్టి ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నిలవడం గమనార్హం. మూడవ స్థానంలో సూపర్ స్టార్ రజనీకాంత్ నిలిచారు. పారితోషికం విషయంలో ఫార్మాట్‌ని మార్చిన ఈ స్టార్స్ ఇప్పుడు సినిమా లాభాల్లో వాటాలని పారితోషికాలుగా డిమాండ్ చేస్తుండటం తెలిసిందే. బాలీవుడ్ బాక్సాఫీస్ బాద్‌షాగా పేరు తెచ్చుకున్న షారుక్ ఖాన్ వరుస ఫ్లాపుల తరువాత -పఠాన్-తో మళ్లీ ట్రాక్‌లోకి రావడం తెలిసిందే. ఈ సినిమా లాభాల్లో తన వాటా కింద షారుక్ రూ.350 కోట్లు తీసుకున్నాడు. ఇండియన్ సినిమాల్లో ఓ మీరో ఇంత పెద్ద మొత్తంలో పారితోషికంగా తీసుకోవడం ఇదే ఫస్ట్ టైమ్. ఇంత మొత్తం దక్కించుకోవడంతో షారుక్ ఇండియన్ హీరోల్లో అత్యధిక మొత్తం అందుకుంటున్న హీరోగా మొదటి స్థానంలో నిలిచాడు. ఆ తరువాత స్థానంలో బన్నీ వచ్చి చేరాడు. పుష్ప, పుష్ప 2 సినిమాలతో బ్లాక్‌బస్టర్ హిట్‌లని సొంతం చేసుకున్న బన్నీ రూ.300 కోట్లు డిమాండ్ చేస్తున్నాడు. ఈ జాబితాలో సూపర్‌స్టార్ రజనీకాంత్ మూడవ స్థానంలో నిలుస్తున్నారు. నెల్సన్ దిలీప్ కుమార్ డైరెక్షన్‌లో రజనీ నటించిన మూవీ -జైలర్-. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని సొంతం చేసుకుని రజనీ కెరీర్‌లోనే రికార్డు స్థాయి వసూళ్లని రాబట్టింది. ఈ సినిమా నుంచే రజనీ రూ.200 కోట్లకు మించి ఒక్కో సినిమాకు డిమాండ్‌చేస్తున్నారట. అయితే ప్రస్తుతం చేస్తున్న 174వ ప్రాజెక్ట్‌కు మాత్రం ఆ మొత్తాన్ని పెంచేశారని, రూ.225 కోట్లు ఈ ప్రాజెక్ట్‌కు తీసుకుంటున్నారని తెలిసింది. రానున్న రోజుల్లో ఈ జాబితాలోకి మహేష్ వచ్చి చేరతాడా?.. లేక ఎన్టీఆర్, రామ్ చరణ్‌లు చేరతారా అన్నది వేచి చూడాల్సిందే.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com